ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

బుధవారం 27 నవంబరు 2024



కనిపించని జోష్..!

మందకొడిగా టీడీపీ సభ్యత్వ నమోదు



- లక్ష్యానికి ఆమడదూరం
- నెలరోజులు గడుస్తున్నా అంతంతే
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకూ 5.5 లక్షలే..
- అత్యధికంగా కళ్యాణదుర్గంలో 77,670..
- అత్యల్పంగా తాడిపత్రిలో 11,887 సభ్యత్వాలు

7లో



గోవిందా..! గోల్‌మాల్

ఖాద్రీశుడి ఆలయానికి తలనీలాల టెండర్లలో తగ్గిన ఆదాయం

- గత ఏడాది రూ.1.77 కోట్లు...
- ప్రస్తుతం రూ.76 లక్షలు తగ్గింపు
- టెండర్లు లేకుండానే మరో సంవత్సరం అప్పగింతకు ఆర్డర్లు
- గోల్‌మాల్ వ్యవహారం అంటూ భక్తుల ఆగ్రహం

(వివరాలు 6లో....)

ఆట్లాడించే వారేరీ?

- స్కూళ్లలో వ్యాయామ ఉపాధ్యాయుల కొరత
- క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు
- కుంటుపడుతున్న వ్యాయామ విద్య
- ఉమ్మడి జిల్లాకు మంజూరైన పోస్టులు 544, వర్కింగ్ పోస్టులు 400
- గత ప్రభుత్వంలో ఒక్కటీ భర్తీ చేయని వైనం



6లో

రైతు బతికే దారేది..?

- మిర్చి రైతుతో ఆటలు
- ధర బాగుందంటూ వ్యాపారుల సమాచారం
- దిగుబడి తీసుకొస్తే.. పడిపోయిందంటూ పచ్చి మోసం..?
- వెనక్కిమళ్లిన అన్నదాత



మార్కెట్ నుంచి మిర్చిని వెనక్కు తీసుకెళ్తున్న రైతు

పురం మార్కెట్‌లో మాయాజాలం

అన్నదాత చిందించే స్వేదానికి..
ఆరుగాలం పడే కష్టానికి..
విలువ లేదు..
అందరి కడుపు నింపి..
ప్రాణాలు నిలిపే..
బంగారు పంటలకు
రేటు లేదు..
మార్కెట్‌లో మాయాజాలం..
గంటగంటకీ రేటు తగ్గిపోతుంది..
వేలకువేలు పడిపోతుంది..
ఆ ధరకు అమ్ముకోలేక..
నష్టాలు మూటగట్టుకోలేక..
నిస్సహాయుడై..
వెనుదిరుగుతున్నాడు అన్నదాత..
పండించిన మిర్చిపై కూర్చుని..
ఉబికొస్తున్న కన్నీళ్లు మిర్చి ఘాటుతో
వస్తున్నాయని చెప్పుకుంటూ..





మార్కెట్‌కు తీసుకొచ్చిన మిర్చి, దిగుబడి నాణ్యతగా ఉందని చూపుతున్న రైతు

హిందూపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకొస్తే అక్కడ ధరలులేక రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చాక ధర తగ్గిపోవడంతో విక్రయించకుండా వెనక్కు తీసుకెళ్తున్నారు. ఉమ్మడి జిల్లాలోనే హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు ఎండుమిర్చి పెద్దఎత్తున వస్తుంది. ఇక్కడికి జిల్లాతోపాటు కర్ణాటక నుంచి అధికంగా రైతులు ఎండుమిర్చిని తీసుకొస్తారు. మార్కెట్‌లో ధరలను ఇష్టారాజ్యంగా తగ్గిస్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. సెప్టెంబరులో మొదటి రకం రూ.15వేల నుంచి రూ.18వేలదాకా క్వింటాల్ ధర పలికింది. అక్టోబరు, నవంబరు నెలల్లో ధరలు తగ్గుతూ వచ్చాయి. మంగళవారం మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి మొదటి రకం రూ.13వేల నుంచిరూ.14వేలదాకా పలికింది. రెండో రకం రూ.8వేల నుంచి రూ.10వేలదాకా పలికింది. మూడోరకం రూ.4వేల నుంచి రూ.6వేల దాకా పలికాయి. ఈ లెక్కన అన్ని రకాలపై రూ.4వేల నుంచి రూ.5వేలదాకా ధరలు పడిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన ధర

హిందూపురం వ్యవసాయ మార్కెట్‌యార్డుకు గతేడాది వచ్చిన మిర్చి ధరలతో పోల్చితే ఈసారి ధరలు భారీగా తగ్గినట్లు తెలుస్తోంది. గతేడాది మొదటిరకం రూ.22వేలకుపైగా ధరలు పలికాయి. ప్రస్తుతం అదే రకాలు రూ.12వేల నుంచి రూ.14వేలు ఫలుకుతుండటం బట్టి ఎంతమేర ధరలు తగ్గాయో అర్థం చేసుకోవచ్చు.

హిందూపురం మార్కెట్‌యార్డుకు 2020-21లో 13వేల క్వింటాళ్లు వచ్చాయి. 2021-22లో 19వేల క్వింటాళ్లు, 2022-23లో 9వేల క్వింటాళ్లు, 2023-24లో ఇప్పటి వరకు 16వేల క్వింటాళ్లకుపైగా సరుకు వచ్చింది.

వర్షం ఎఫెక్ట్

సెప్టెంబరులో ఎండు మిర్చి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. అక్టోబరు వచ్చేనాటికి వర్షాల కారణంగా ధరలు తగ్గుతూ వచ్చాయి. వర్షం ప్రభావంతో ఎండుమిర్చికి మచ్చ ఏర్పడి, నాణ్యత తగ్గిందని మార్కెట్ అధికారులు పేర్కొంటున్నారు. నాలుగు రోజులుగా ఎండ లేకపోవడంతో ఎండుమిర్చిలో తేమ అలాగే ఉందనీ, దీంతో ధర తక్కువగా పలుకుతోందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

పెట్టుబడి కూడా రాదు

ఎకరాలో మిర్చి పండించి, మార్కెట్‌కు తీసుకెళ్లేవరకు రూ.70నుంచి రూ.80వేల దాకా ఖర్చవుతుంది. ఎకరాకు 6 క్వింటాళ్లదాకా దిగుబడి వచ్చింది. ప్రస్తుత ధరలను బట్టి చూస్తే ఎకరాకు రూ.40వేలు కూడా వచ్చే పరిస్థితి లేదు. దీంతో రైతుకు పెట్టుబడి కూడా దక్కదు. ప్రస్తుతం తుపాను ప్రభావంతో మరో 20 రోజులు ఎండుమిర్చి ధరలు ఇలాగే ఉంటాయని వ్యాపారులు అంటున్నారు. అప్పటికి ఎండుమిర్చి సీజన్ ముగిసే అవకాశం ఉంది.


కష్టం కూడా దక్కలేదు



ఇంటిల్లిపాదీ కష్టపడి మిర్చి పండించాం. ప్రస్తుత ధరలతో పెట్టుబడి కూడా దక్కదు. ఇలా అయితే మిరపపంట ఏ రైతూ సాగుచేయడు. మార్కెట్‌కు తీసుకొచ్చి ఇంటికి తిరిగి వెళ్తే అప్పులవారుంటారు. వారికి అంతో ఇంతో ఇద్దామన్నా లేదు.

- ఏపీపీ నాయుడు, రైతు, అచ్చంపల్లి

మంచి ధర ఇస్తామని..



శుక్రవారం చాలామంది రైతులకు ఎండు మిర్చి వ్యాపారులు మంచి ధర ఉందని సరుకు తీసుకురావాలని చెప్పారు. హిందూపురం మార్కెట్‌కు వచ్చాక వారు చెప్పిన ధరలో సగం కూడా దక్కకపోవడంతో పరిగికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎండుమిర్చిని అలాగే ట్రాక్టర్‌లో వెనక్కు తీసుకెళ్లారు. రైతులు మాట్లాడుతూ.. హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యాపారులు రింగుగా మారారు.

నాణ్యతలేకనే..

గత నెలలో కురిసిన వర్షాలు, ప్రస్తుతం తుఫాను కారణంగా ఎండు మిర్చిలో తేమశాతం అధికంగా ఉంది. దీంతో నాణ్యత తగ్గింది. ఫలితంగా ధరలు తగ్గాయి. రైతుకు గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు చేపడతాం.

- చంద్రమౌళి, మార్కెట్‌యార్డు కార్యదర్శి

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలకాశి.. కలెక్టర్‌రేట్ వద్ద కార్మిక సంఘాల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

పుట్టపర్తి టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలకాశి డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ కార్మికులు మంగళ వారం కదంతొక్కారు. స్థానిక గణేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలకాశి మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన నరేంద్ర మోదీ ప్రభుత్వం గతంలో రద్దు చేశామని చెబుతున్న నల్ల చట్టాలను మళ్లీ అమలులోకి తెచ్చే ప్రయత్నాలు చేస్తోందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగింటికి కుదించిందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉవ్విళ్లూరుతున్నాయన్నారు. ఈ విధానాలను మానుకోవాలని సూచించారు. లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు ఇంతియాజ్, వేమయ్య, రైతు సంఘం రాష్ట్ర నేత కాటమయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, మహిళాసమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జయలక్ష్మి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

'పైసలిస్తేనే పత్రం'పై ఉన్నతాధికారి సీరియస్

కాంట్రాక్టు ఉద్యోగిని పక్కన పెట్టాలని ఆదేశాలు

సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీఓ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బర్త్ సర్టిఫికెట్ దరఖాస్తులను నమోదు చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

బత్తలపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఒకటో సచివాలయంలో జనన ధ్రువీకరణ పత్రాలను రేటు కట్టి మరీ విక్రయిస్తుండడంపై 'పైసలిస్తేనే పత్రం..' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రచురించిన కథనం అధికారుల్లో చలనం తెచ్చింది. సర్టిఫికెట్ల జారీలో వసూళ్లపై జిల్లా ఉన్నతాధికారి సీరియస్ అయినట్లు సమాచారం. దీంతో ఉదయం ఎంపీడీఓ నరసింహనాయుడు, ఈఓఆర్డీ కిష్టప్ప సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయంలో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగి గంగాధర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పంచాయతీ కార్యదర్శిని ఎంపీడీఓ ఆరాతీశారు. 2500 వరకు పెండింగ్ ఉన్నట్లు చెప్పడంతో ఆశ్చర్యానికి లోనయ్యారు. కాంట్రాక్టు ఉద్యోగి గంగాధర్‌ను జనన ధ్రువపత్రాల జారీ విధుల నుంచి తప్పించాలని ఆదేశించారు. బత్తలపల్లి 1, 2 సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లను రపించి, వారికి బర్త్ సర్టిఫికెట్ల నమోదు విధులు అప్పగించారు. రోజూ మూడు షిఫ్టుల వారీగా విధులు నిర్వహించేలా చూడాలని ఈఓఆర్డీని ఆదేశించారు. అధిక మొత్తంలో పెండింగ్ ఉన్నందున బత్తలపల్లి సచివాలయనికి మరో లాగిన్ ఇవ్వాలని జిల్లా జనన, మరణ రిజిస్ట్రేషన్ అధికారి ఖలందర్‌ను ఫోన్ ద్వారా కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల నమోదు, జారీలో వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

రాజ్యాంగం పవిత్ర గ్రంథం : కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): భాతర రాజ్యాంగం పవిత్ర గ్రంథమని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలందరి హక్కులు, బాధ్యతలను రాజ్యంగం గుర్తు చేస్తుందన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ రాజ్యంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ నివాళి

పుట్టపర్తిరూరల్(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఎస్పీ రత్న పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగమన్నారు. అనంతరం రాజ్యాంగ పరిరక్షణకు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ రత్న

వైసీపీ మండల కన్వీనర్‌పై కేసు నమోదు

పెనుకొండ టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్డును స్థలం అని నమ్మించి, అంటగట్టడంతోపాటు డబ్బు వెనక్కి అడిగినందుకు బెదిరించిన కేసులో వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ ముఖ్య అనుచరుడు, పెనుకొండ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెనుకొండ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనుకొండలో డా.రోహిల్ ఆయన భార్య దంత వైద్యురాలు చందన నివాసముంటున్న పట్టణంలోని రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద కొన్నినెలల క్రితం రూ.46 లక్షలతో రెండు సెంట్ల భూమిని రాజశేఖర్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి నుంచి కొనుగోలు చేశారు. ఒప్పందం ప్రకారం తొలుత రూ.16 లక్షలు చెల్లించారు. రికార్డులను చెక్ చేసుకోగా.. అది రస్తా స్థలం అని తెలిసింది. స్థలం విక్రయించిన ఇద్దరిని బాధిత వైద్యురాలు నిలదీశారు. డబ్బు వెనక్కివ్వాలని డిమాండ్ చేశారు. దీంతో సుధాకర్ రెడ్డి బెదిరించడంతోపాటు దుర్భాషలాడాడని డా.చందన ఫిర్యాదు చేయడంతో ఈనెల 12న రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డాక్టర్ చందనకు అమ్మిన స్థలం



పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు గణపతి



ఆప్టా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన నంబూరి వెంకట నాయుడు

పుట్టపర్తిరూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దీర్ఘకాలిక డిమాండ్ అయిన పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతి.. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు వేతన బకాయిలను విడతల వారీగా చెల్లించాలని కోరారు. ఉద్యోగులకు 25శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. అంతకుముందు ఆప్టా జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నంబూరి వెంకటనాయుడు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా చిరంజీవి, ప్రధానకార్యదర్శిగా మధుసూదన్ రెడ్డి, అదనపు కార్యదర్శిగా శివసంపత్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌రావు పర్యవేక్షించారు.

గజగజ

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

వణికిస్తున్న చలిగాలి



పుట్టపర్తిరూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం విచిత్ర వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. చలిగాలులు విపరీతమయ్యాయి. ప్రజలను వణికిస్తున్నాయి. జిల్లాలో చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో పుష్కలంగా నీరు ఉంది. అక్టోబరులో భారీ వర్షాలు కురిశాయి. తాజాగా జిల్లాలో తూర్పుదక్షిణ ప్రాంతాల్లో చలిగాలులు వీస్తున్నాయి. మధ్యాహ్నం నుంచే ముసురేసుకుని రాత్రికి పొగమంచు కమ్మేస్తోంది. ఈనెల 20న 32 డిగ్రీలుగా నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు రోజురోజుకీ తగ్గిపోతున్నాయి. సాధారణ ఉష్ణోగ్రతల్లో పగలు, రాత్రికి తేడా లేకుండా మబ్బులు కమ్మేసి, చల్లటి వాతావరణం నెలకొంటోంది. ఇందుకు ప్రధాన కారణం ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో ఉష్ణోగ్రతలు పడిపోవడమేనని వాతావరణ శాస్త్రవేత్తలు వెల్లడిస్తున్నారు. ఈశాన్య రుతుపవనాల ప్రవేశంతో పగలే చల్లటి గాలులతో చలిపెరిగింది. దీంతో ప్రజలు వణికిపోతున్నారు.

వృద్ధులు ఉక్కిరిబిక్కిరి

ప్రస్తుత వాతావరణం వృద్ధులు, చిన్నపిల్లలపై తీవ్రప్రభావం చూపుతోంది. నడక, ఇతర వ్యాపకాలతో ఉదయాన్నే బయటకు వెళ్లేవారికి కఫం చేరి, ఆయాసానికి దారి తీస్తోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కృత్రిమ శ్వాస అవసరమయ్యే రోగులు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

ఆస్పత్రులకు క్యూ

జిల్లాలో పెరుగుతున్న చలిమంచు ప్రభావంతో ఆరోగ్య సమస్యలు ఎక్కువయ్యాయి. జ్వరం, దగ్గు జలుబుతో బాధపడేవారి సంఖ్య పెరిగిపోయింది. వృద్ధులు, అస్తమా పీడితులు ఆస్పత్రుల పాలవుతున్నారు. దాదాపు పదిరోజుల్లో జిల్లా ఆసుపత్రుల్లో అస్తమా, ఇతర శ్వాస సంబంధిత ఇబ్బందులతో చికిత్సలు పొందేవారి సంఖ్య గణనీయంగా పెరిగిపోతోంది. ఇక చలి జ్వరం దగ్గువంటి వారి సంఖ్య చెప్పనక్కరలేదు.

అత్యవసరమైతే తప్ప.. బయటకు వెళ్లొద్దు..

ప్రస్తుతం చలిమంచు వాతావరణం కారణంగా జలుబు, జ్వరాలు, దగ్గు తదితర సమస్యలతో ఆస్పత్రులకు వచ్చేవారి సంఖ్య పెరిగిపోయింది. ఇలాంటి వాతావరణంలో పిల్లలను బయటకు తీసుకెళ్లొదు. తప్పనిసరయితే రక్షణ సాధనాలు ధరించాలి. పిల్లలకు వేడి ఆహారం, నీరు, పాలు ఇవ్వాలి. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, బయటప్రదేశాలకు వెళ్లే వృద్ధులు ముఖాలను కప్పి ఉంచే క్యాపులు, ఫుల్‌హ్యాండ్స్ స్వెట్టర్లు, శాలువాలు ధరించాలి.

- డాక్టర్ మంజువాణి, జిల్లా వైద్యాధికారి

ఆటల్లాడించేవారేరీ ?

- స్కూళ్లలో వ్యాయామ ఉపాధ్యాయుల కొరత
- క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు
- కుంటుపడుతున్న వ్యాయామ విద్య
- ఉమ్మడి జిల్లాకు మంజూరైన పోస్టులు 544, వర్కింగ్ పోస్టులు 400
- గత ప్రభుత్వంలో ఒక్కటీ భర్తీ చేయని వైనం


సత్యసాయి జిల్లా ముద్దిరెడ్డిపల్లిలో క్రీడా పోటీల్లో విద్యార్థులు (ఫైల్)

అనంతపురం విద్య, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్కూళ్లలో పీడీలు, పీఈటీలు లేక వ్యాయామ విద్య కుంటుపడుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏళ్ల తరబడి వ్యాయామ టీచర్ల కొరత వేధిస్తోంది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎలాంటి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయలేదు. ఫలితంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాధారణ విద్యతో పాటు వ్యాయామ విద్య నిర్వీర్యమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. విద్యాశాఖ అధికారులు సమాచారం మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంజూరైన పోస్టులు 544 ఉండగా, 400 మంది పని చేస్తున్నారు. మరో 144 పీడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో చాలా స్కూళ్లలో విద్యార్థులకు క్రీడలు నేర్పించే వారే లేకుండాపోయారు.

స్కూళ్లకు గ్రాంట్ ఇవ్వాలి

కేజీబీవీల్లో పీఈటీలతో ఉదయం 6 గంటల నుంచి 10గంటల వరకూ, సాయంత్రం 3.30 గంటల నుంచి 6.30 గంటల వరకూ పని చేయిస్తున్నారు. సాయంత్రం 6.30 గంటలకు పని ముగించుకుని ఇంటికెళ్లేందుకు రాత్రి అవుతోంది. మహిళా వ్యాయామ టీచర్లకు ఇబ్బంది లేకుండా ఉదయం 7 నుంచి 11 వరకు, సాయంత్రం 3 నుంచి 5.30 గంటల వరకూ వర్క్ సమయం మార్చాలని డిమాండ్ చేస్తున్నాం.

- అక్కులప్ప, జిల్లా అధ్యక్షుడు, ఏపీపీఈటీ అండ్ ఎస్ఏపీఈ యూనియన్

వ్యాయామ టీచర్లపై పనిభారం

జిల్లాలో చాలా స్కూళ్లలో విద్యార్థులు ఎక్కువగా ఉండటం, పీడీ లేదా పీఈటీ ఒక్కరే ఉంటున్నారు. 600 మంది, 800 మంది విద్యార్థులున్న చోట కూడా ఒక్కరే పీడీ లేదా పీఈటీ ఉంటున్నారు. ఇలాంటి చోట క్రీడల బోధన తలకు మించిన భారంగా మారింది. దీంతో విద్యార్థులకు సక్రమంగా వివిధ క్రీడలు నేర్పించలేని పరిస్థితి నెలకొంది. స్కూళ్లలో విద్యార్థులకు కబడ్డీ, ఆర్చరీ, అథ్లెటిక్స్ చెస్, క్రికెట్, బాక్సింగ్, బాస్కెట్ బాల్, బేస్‌బాల్, హాకీ, రగ్బీ, సాఫ్ట్‌బాల్, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, తైక్వాండో, క్యారమ్స్, త్రోబాల్, వాలీబాల్ వంటి సుమారు 53 రకాల క్రీడలపై తర్ఫీదు ఇవ్వాలి. ఆయా ప్రాంతాల్లో విద్యార్థుల ఆసక్తిని బట్టి శిక్షణ ఇవ్వడంతోపాటు, వారిని పోటీలకు సిద్ధం చేయించాలి. అయితే స్కూళ్లలో పీడీలు, పీఈటీల కొరత వల్ల విద్యార్థులకు సక్రమంగా ఏ క్రీడలను నేర్పించలేకపోతున్నారు. దీంతో విద్యార్థులు వారి ఉజ్వల భవిష్యత్తు నష్టపోతున్నారు.

కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో మరింత ఇబ్బందులు

కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో వ్యాయామ టీచర్లు మరింత ఇబ్బంది పడుతున్నారు. కేజీబీవీల్లో పనిచేసే మహిళా వ్యాయామ టీచర్లను ఉదయమే వచ్చి, సాయంత్రం చీకటిపడ్డాక వెళ్లమని చెబుతున్నారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో ఆయా టీచర్లపై ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ వంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకూ, సాయంత్రం 3 గంటల నుంచి 5.30 గంటల వరకూ సమయం కేటాయించాలని వారు కోరుతున్నారు. మోడల్ స్కూళ్లలో సైతం ఒక్క పీఈటీనే ఉంటున్నారు. సుమారు 600 మంది వరకూ విద్యార్థులు ఉండటం వల్ల పనిభారం అధికమవుతోందని, అదనంగా మరో వ్యాయామ టీచర్‌ను కేటాయించాలన్న డిమాండ్ ఉంది.

డీఎస్సీలో పీడీ పోస్టులు భర్తీ చేయాలి

స్కూళ్లలో చదువుతోపాటు క్రీడలు కూడా అత్యంత కీలకం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 544 పీడీ పోస్టులు మంజూరైనా వందలాది స్కూళ్లలో పీడీలు కొరత ఉంది. చాలా స్కూళ్లలో పీడీ లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి.

-మొరార్జీ యాదవ్, స్కూల్‌గేమ్స్ సెక్రటరీ


గుమ్మఘట్టలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

పాఠశాలకు పీడీలు కీలకం

పాఠశాలల్లో విద్య ఎంత అవసరమో క్రీడలు కూడా అంతే అవసరం. పాఠశాల స్టాఫ్ అంతా విద్యాభివృద్ధికి తోడ్పడితే క్రీడల పట్ల పిల్లలకు ఆసక్తి పెంచేది పీడీ ఒక్కరే. విద్యార్థులు మానసిక ఉల్లాసానికి క్రీడాభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ పాఠశాలను క్రమశిక్షణలో ఉంచగలుగుతారు.

- యశోధర, విద్యా కమిటీ చైర్‌పర్సన్, గుమ్మఘట్ట

ఆటలు మరచిపోయాం



పాఠశాలలో రెండేళ్లుగా పీడీ లేకపోవడంతో ఆటలు మరచిపోయాం. క్రీడల్లో ఆసక్తి ఉన్నప్పటికీ శిక్షణ ఇచ్చేవారు లేక దూరం అవుతున్నాం. మాకు పీడీ సార్ వచ్చేలా చూడాలి. ఆటలపై మాకు శిక్షణ ఇచ్చేలా చూస్తారని ఆశిస్తున్నాం.

- పల్లవి, విద్యార్థిని, గుమ్మఘట్ట

గుమ్మఘట్ట : మండల పరిధిలో 11 ఉన్నత పాఠశాలలు ఉండగా గత రెండేళ్లుగా రెండు పాఠశాలల్లో మాత్రమే పీడీలు పని చేస్తున్నారు. మిగతా పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు లేకపోవ డంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. మండలంలో ఉన్నత పాఠశా లల్లో 4266 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే కేవలం తాళ్లకెర పాఠశాలలో 371 మంది, నేత్రపల్లి పాఠశాలలో 531 మందికి మాత్రమే పీడీలు ఉన్నారు. ఈ పాఠశాల విద్యార్థులకు మాత్రమే వ్యాయామ విద్య అందుతోంది.

కామెడీ వీరా..!

కామెడీ షాపు పేరుతో యూట్యూబ్ చానల్

నెటిజన్ల ఆదరణ పొందుతున్న ఆటోడ్రైవర్ వీరా


వీడియో చిత్రీకరణ

పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూ, తమ సృజనాత్మకతకు పదును పెడుతూ కొంతమంది యువత అనతి కాలంలోనే బాగా ఫేమస్ అవుతున్నారు. ఒక్కరిగానే కాకుండా తమ స్నేహితులతో కలిసి బృందంగా ఏర్పడి కార్యక్రమాలు నిర్వహిస్తూ గుర్తింపు పొందుతున్నారు. అలాంటి కోవకు చెందిన వారే ఉరవకొండకు చెందిన వీరాంజనేయులు ఉరఫ్ వీరా అతడి మిత్ర బృందం.

ఉరవకొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన వీరాంజనేయులు అతడి మిత్ర బృందం చిన్న చిన్న పనులు చేసుకునే కార్మికులు. వారందరూ ఒక బృందంగా ఏర్పడి కామెడీ షాపు పేరుతో వీడియోలను తీస్తూ ఎంతో మంది నెటిజన్ల ఆదరణ పొందుతున్నారు. బృందంలోని సభ్యులకు సాంకేతిక పరిజ్ఞానం అంతగా లేదు. కానీ సృజన ఉంది. కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లు, అధునాతమైన కెమెరాలు లేవు. కానీ ఏదో ఒకటి చేయాలనే తాపత్రయం ఉంది. అందుకే అందుబాటులో ఉన్న ఫోన్లతోనే, తమకు తెలిసిన పరిజ్ఞానంతోనే వీడియోలు తీస్తూ కామెడీషాపు చానల్‌తో దూసుకెళ్తున్నారు. వారు తీసిన వీడియోలు ఏపీ, తెలంగాణా, కర్ణాటకలో ని తెలుగువారి ఆదరణ పొందుతున్నాయి. హాస్యం ప్రధానంగా వీడియోలు రూపొందిస్తున్నారు. అప్పుడప్పుడు సందేశాత్మకంగా, సమకాలీన సమాజంలో జరిగే అంశాలు, సంఘటనలతో కూడా లఘుచిత్రాలు రూపొందిస్తూ వీక్షకులను అలరిస్తున్నారు. వారు రూపొందించిన వకీల్‌సాబ్, అఖండ, వ్యాట్సాప్ పే తదితర వీడియోలకు ప్రజలనుంచి మంచి ఆదరణ లభించింది.

కామెడీ షాపు పేరుతో యూట్యూబ్ చానల్ ప్రారంభం

ఉరవకొండకు చెందిన వీరాంజనేయులు ఆటో డ్రైవర్. ఆటోనే అతడి జీవనాధారం. డిగ్రీ వరకూ చదువుకున్నాడు. చిన్నప్పటి నుంచి సినిమాల పట్ల ఉన్న ఆసక్తితో యాక్టర్ కావాలనుకున్నాడు. ఈక్రమంలోనే ఎక్కడికో సుదూర ప్రాంతాలకు వెళ్లి, వాళ్లని, వీళ్లని ప్రాధేయపడేకంటే తనే సొంతంగా వీడియోలు రూపొందించి, ట్యాలెంట్ నిరూపించుకోవాలనుకున్నాడు. ఈక్రమంలోనే తన మిత్రులతో కలిసి 2016లో వీరు కామెడీ షాపు పేరుతో యూట్యూబ్ చానల్ ప్రారంభించాడు. తన మిత్రులైన మల్లికార్జున, ఆరిఫ్, ప్రదీప్, ఓబులపతి, నూర్‌బాషా, మల్లికార్జునతో కలిసి సందేశాత్మక, హాస్యాన్ని పంచే 400పైగా వీడియోలు తీశారు. వీటిని యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. వీటిని 30లక్షల మందికిపైగా చూశారు. తన లఘుచిత్రాలో నటించేవారంతా బారామసాల చేసేవారు, మెకానిక్, క్యాబ్‌డ్రైవర్, వంటమనిషి, భవననిర్మాణ కార్మికులు అని వీరాంజనేయులు పేర్కొన్నాడు.

సినిమాల్లో నటించాలన్నదే ధ్యేయం: వీరా



సినిమాల్లో నటించాలన్నదే నా ధ్యేయం. ఇప్పటికే రాధ మాధవం అనే సినిమాలో విలన్ పక్కన కమేడియన్‌గా నటించా. చానల్ ప్రారంభంలో ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నా. నెలకు ఆరు వీడియోలు తీస్తున్నాం. రూ.8వేల దాకా ఆదాయం వస్తోంది. మా వీడియోల ద్వారా పంచుతున్న హాస్యం చూసి గతంలో విమర్శించిన వారే ఇప్పుడు పొగుడుతుండటంతో ఎంతో సంతోషం కలుగుతోంది.

న్యూస్‌బాక్స్


అలంకరణలో స్వామివారు

నేమకల్లు అంజన్నకు వెన్న అలంకారం

బొమ్మనహాళ్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి మంగళవారం వెన్న అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్తీక మాసం సందర్భంగా చివరి మంగళవారం స్వామివారికి విశేషపూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్ కుమార్ చార్యులు, సంతోష్ కుమార్ చార్యులు పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిర్మల్యవిసర్జన, విష్ణుపారాయణం, అష్టోత్తర పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించిన అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు.

రానున్న మూడు రోజులకు వర్ష సూచన

బుక్కరాయసముద్రం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న మూడు రోజుల్లో వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో తుఫానుగా మారిందన్నారు. ఈ ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో తేలిక పాటి నుంచి పలు చోట్ల ఓ మోస్తారు వర్ష సూచన ఉన్నట్లు తెలిపారు. పలు చోట్ల ఉరుములుతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు.

నేడు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాక

అనంతపురం విద్య, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ బుధవారం జిలాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ విద్యాశాఖాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో మండల విద్యాశాఖాధికారులతో కలెక్టర్‌తో కలసి సమావేశం నిర్వహించనున్నారు. ముఖ్యంగా అపార్, ఇతర అంశాలపై ప్రిన్సిపల్ సెక్రటరీ సమీక్ష నిర్వహించనున్నారు. దీనిపై డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ...ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యటన ఉంటుందని స్పష్టం చేశారు.

గోవిందా..! గోల్‌మాల్

ఖాద్రీశుడి ఆలయానికి తలనీలాల టెండర్లలో తగ్గిన ఆదాయం

- గత ఏడాది రూ.1.77 కోట్లు...
- ప్రస్తుతం రూ.76లక్షలు తగ్గింపు
- టెండర్లు లేకుండానే మరో సంవత్సరం అప్పగింతకు ఆర్డర్లు
- గోల్‌మాల్ వ్యవహారం అంటూ భక్తుల ఆగ్రహం


కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం

కదిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తలనీలాల టెండర్లలో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నా యి. సార్వత్రిక ఎన్నికల సమయంలో టెండర్లు జరగడంతోనే ఈ ఆరోపణలు ఎక్కువయ్యాయి. టెండర్లు అప్పగించిన విధానమే అనుమానాలకు తావిస్తోంది. గతంలో రూ.1.77కోట్లు పలికిన తలనీలాల టెండరును ఈఏడాది రూ.1.01 కోట్లకే అప్పగించడంపై తీవ్ర విమర్శలు వినవస్తున్నాయి. అదికూడా మరో సంవత్సరం అదే సంస్థకు ఇచ్చేలా దేవదాయ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆలయ వర్గాలు చెబుతున్నారు. మొత్తం మీద ఈసంవత్సరం ఈటెండర్లు లేకుండా, వచ్చే సమయం అసలే టెండర్లు లేకుండా అదే సంస్థకు అప్పగించడం పట్ల అనేక అనుమానాలు కలుగుతున్నాయి. దీనిపైనే భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టెండర్ విధానాన్ని కూటమి ప్రభుత్వం పునః సమీక్షించాలని భక్తులు, హిందూధార్మిక సంస్థలు కోరుతున్నాయి.


ఆలయానికి రూ. 76 లక్షలు నష్టం

తలనీలాల ఆలయ ఆదాయం ఈ ఏడాది బాగా తగ్గినట్లు అధికారులిచ్చిన గణాంకాలు చెబుతున్నాయి. 2023-24 సంవత్సరంలో రూ.1,77,00,211లకు టెండరు పలికింది. దీన్ని కేవీ ఎంటర్‌ప్రైజస్ చాగల మర్రి వారు దక్కించుకున్నారు. వీరికి 10-1-2024వరకు గడువుండేది. గడువు ముగిసిన తరువాత ఆలయ అధికారులు 11-1-2024నుంచి 10-1-2025వరకు టెండర్లకు పిలిచారు. 8మార్లు ఈటెండర్లు పిలిచారు. ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈ ఏడాది మే 9న బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో తలనీలాలకుగాను దాదాపు రూ.76లక్షలు తగ్గించి రూ.1.01కోట్లకు దక్కించుకున్నారు. అది కూడా గతంలో వేలం పాడిన కేవీ ఎంటర్‌ప్రైజస్‌కే తిరిగి అప్పగించారు. సాధారణంగా ఎన్ని నెలుల గడిస్తే, అన్ని నెలలకే, గడిచిన నెలలు తీసేసి, మిగిలిన నెలకులకు మాత్రమే టెండర్లు పిలుస్తారు. ఇక్కడ మాత్రం ఈ ఏడాది జనవరి 11 నుంచి వచ్చే ఏడాది జనవరి 10 వరకు టెండర్లు పిలిచారు. ఇందులో మతలబు ఏమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఏడాదితో పాటు వచ్చే ఏడాదికి కూడా కేవీ ఎంటర్‌ప్రైజెస్‌కే టెండరు అప్పగించడంతో దాదాపు రూ.1.5కోట్లకు పైగా ఆలయం ఆదాయం కోల్పోయే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డారా..?

తలనీలాల టెండర్ల వ్యవహారం పరిశీలిస్తే పెద్దఎత్తున గోల్‌మాల్ జరిగినట్లు అర్థమవుతుంది. ఈ-టెండర్లల్లో పాల్గొనని కేవీ ఎంటర్‌ప్రైజస్ బహిరంగ టెండర్లలో మాత్రం పాల్గొంది. గతంలో రూ.1.77కోట్లకు వేలం దక్కించుకున్న ఈసంస్థ, ఈసంవత్సరం రూ. కోటి ఒక్క వెయ్యికే వేలం దక్కించుకుంది. రూ.76 లక్షల తక్కువకు టెండర్ దక్కించుకోవడంతోనే గోల్‌మాల్ జరిగిందని అనుమానిస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే 8మార్లు ఈ-టెండర్లు పెట్టినా ఎవరూ పాల్గొన్నలేదని అధికారులంటున్నారు. మరి బహిరంగ వేలంలో పాల్గొనే వారికి ఎందుకు తలనీలా రేటు తగ్గించి అప్పగించారో అర్థం కాని విషయం. ప్రతి సంవత్సరం ఆలయానికి భక్తుల రాకపెరిగిందే తప్ప తగ్గలేదు. టెండర్ విలువ మాత్రం తగ్గింది. కరోనా సమయంలో కూడా రూ.కోట్లు పలికిన తలనీలాలు ధర, ఇప్పుడు తగ్గడం వెనుక కమీషన్ల కక్కుర్తే కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.


వచ్చే ఏడాది టెండర్లు నిర్వహించాలి



ఈ ఏడాది తలనీలాలకు టెండర్లు నిర్వహించి, హెచ్చుపాట టెండర్ దారులకు అప్పగించారు. వచ్చే సంవత్సరం కూడా టెండర్లు లేకుండా అదే సంస్థకు అప్పగించడం ఏమిటి. వచ్చే సంవత్సరాలకు తలనీలా టెండర్ నిర్వహించి, స్వామివారి ఆదాయం పెంచాలి. గడిచిన టెండర్ విధానం పునఃసమీక్షించాలి.

- శరత్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నాయకుడు

విచారణ జరపాలి



గతంలో ఎక్కువ పలికిన తలనీలాల ధర ఈసంవత్సరం ఎలా తగ్గింది? ఈ- టెండర్లలో ముందుకురాని వేలం పాట దారులు, బహిరంగ వేలానికి ఎలా ముందుకొచ్చారు? ఈ టెండర్ వ్యవహారంలో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగింది. కూటమి ప్రభుత్వం దీనిపై విచారణ జరపాలి.

- హరిప్రసాద్, మంగళి మహాసభనాయకుడు

టెండర్లు రాకపోవడంతోనే ధర తగ్గించాం

తలనీలాల టెండర్లకు 8మార్లు ఈ-టెండర్లు నిర్వహించాం. ఒక్కటికూడా దాఖలు కాలేదు. ఉన్నతాధికారుల అనుమతితో బహిరంగ వేలం నిర్వహించాం. అంతర్జాతీయంగా తలనీలాలకు ధర లేకపోవడంతో ఇక్కడ కూడా తగ్గించాం. ఒక సంవత్సరం పాటు టెండర్ వేయడం వలన ఆలయ అధికారులు పోగుచేసిన తలనీలాలు వారికే ఇచ్చాం. ఉన్నతాధికారుల ఆదేశం మేరకే వచ్చే సంవత్సరం కూడా టెండర్లు వారికే ఇచ్చేలా ఉత్తర్వులు ఇచ్చాం.

- ఈఓ శ్రీనివాసరెడ్డి

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎస్‌బీఐ డీజీఎం దినేష్ గులాటి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న సాంకేతికయుగంలో ప్రజలను పట్టి పీడిస్తున్న సైబర్ నేరగాళ్ల పట్ల, డిజిటల్ మోసాలపై మరింత అప్రమత్తంగా ఉండాలని స్టేట్ ఆఫ్ ఇండియా కర్నూలు జోనల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్ గులాటి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సాయినగర్ ఎస్‌బీఐ కార్యాలయంలో సైబర్‌క్రైం, కస్టమర్ సర్వీస్ కేర్‌పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్‌బీఐ డీజీఎం దినేష్ గులాటి మాట్లాడుతూ ప్రజలను ఎక్కడి నుంచో ఫ్రాడ్, ఫేక్ కాల్స్‌తో వలలో వేసుకుని బాధితుల ఖాతాల్లో నుంచి డబ్బులు నొక్కేస్తు న్న సైబర్ నేరగాళ్ళు, డిజిటల్ మోసగాళ్ళపట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఖాతాదారులకు డిజిటల్ మోసాలను నిరో ధించడానికి, కస్టమర్ సర్వీస్‌లను మెరుగుపరిచేందు సైబర్‌భద్రతపై అవగాహన పెంచాలన్నారు. ఓ వైపు పట్టణాలు, నగరాల నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించిన సైబర్, డిజిటల్ మోసగాళ్లను కట్టడిచేసేందుకు ప్రజలలో అవగాహన, చైతన్యం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బ్యాంకర్లు, పోలీసులు, టెలికాం ముబైల్ సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతోనే సైబర్, డిజిటల్ మోసాలు, ఫేక్‌కాల్స్, ఫ్రాడ్స్‌ను అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రమేష్‌బాబు, ఏజీఎంలు చల్లా కోటిరెడ్డి, మేనేజర్లు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కణేకల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెణికల్లు గ్రామంలో రామాంజి(38) అనే వ్యక్తి మంగళవారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగమధు తెలిపారు. విడపనకల్లు మండలం కొట్టాలపల్లి గ్రామానికి చెందిన రామాంజి 15 ఏళ్ల క్రితం బెణికల్లు గ్రామానికి చెందిన ఈరమ్మను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. కూలీ పని చేసుకుని జీవించే రామాంజి పుట్టింటికి వచ్చిన ఈరమ్మ కోసం సోమవారం రాత్రి గ్రామానికి వచ్చాడు. వారిద్దరి మధ్య చిన్నపాటి తగాదా జరగడంతో రామాంజి మంగళవారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరివేసుకుని మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేబుల్ చోరీపై డీఎస్పీ ఆరా

యాడికి, నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైవాలమడుగు గ్రామంలో కేబుల్‌వైర్ల చోరీపై మంగళవారం తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు రైతులతో ఆరాతీశారు. కేబుల్‌వైర్లు చోరీ జరిగిన వ్యవసాయ బోరు బావులను ఆయన పరిశీలించారు. వరుసగా చోరీ జరిగిన సంఘటనలపై రైతులనుంచి వివరాలు సేకరించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ కేబుల్‌వైర్ల చోరీఐ ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. రైతులు కూడా పోలీసు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. గ్రామస్థులు, పోలీసు సిబ్బందితో కలిసి నాలుగు ప్రత్యేక టీంలను ఏర్పాటుచేస్తున్నామని చోరీలను పూర్తిగా అరికడతామన్నారు. అయన వెంట సీఐ ఈరన్న ఉన్నారు.

బోగస్ పట్టా కేసులో వ్యక్తి అరెస్టు

- మాజీ ఎమ్మెల్యే అత్తార్, ఆర్ఐని నిందితులుగా చేర్చిన పోలీసులు

కదిరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని సున్నపుగుట్ట తండాలో బోగస్ పట్టా కేసులో సోమ్లానాయక్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... సున్నపుగుట్టతండాలో బోగస్ పట్టాలు చేయించి ఇవ్వాలని సోమ్లానాయక్ నాటి ఆర్ఐ మున్వర్ బాషాను కోరాడు. దీంతో సోమ్లానాయక్‌ను ఆ ఆర్ఐ అప్పటి ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా వద్దకు తీసుకెళ్లాడు. ఆ తరువాత బోగస్ పట్టాలు తయారుచేసి ఇచ్చేందుకు రూ.20 లక్షలు ఇవ్వాలని ఆర్ఐ డిమాండ్ చేశాడు. బేరమాడిన తరువాత రూ.11 లక్షలు ఇచ్చేందుకు వారు అంగీకరించారు. దీంతో ఆర్ఐ కొన్ని బోగస్ పట్టాలను తయారు చేసి సోమ్లానాయక్‌కు ఇచ్చాడు. అందులో కొంతమందికి పట్టాలు ఇచ్చారు. ఇంకా 39 పట్టాలను సోమ్లానాయక్ తన వద్దే పెట్టుకున్నాడు. పట్టణంలోని శివాలయం వీధిలో ఉంటున్న పీరునాయక్ 2018లో తనకు, తన చెల్లెలుకు పట్టా ఇప్పించాలని సోమ్లానాయక్‌ను కోరాడు. ఆ మేరకు మొదట రూ.50 వేలు ఇచ్చాడు. దీంతో సోమ్లానాయక్ వారికి పట్టాలు ఇప్పించాడు. మిగిలిన రూ.2.50 లక్షలు ఇవ్వకపోవడంతో సోమ్లానాయక్ ఆ పట్టాలు లాక్కుని దౌర్జన్యం చేశాడని పీరునాయక్ ఈనెల 22న పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు స్థానిక వైజంక్షన్ వద్ద మంగళవారం సోమ్లానాయక్‌ను అరెస్టు చేశారు. విచారించగా.. పై విషయాలు వెలుగుచూశాయి. సోమ్లానాయక్‌ను కోర్టు ముందు హాజరు పరచగా, రిమాండ్ విధించారు. ఈ కేసులో ఆర్ఐ మున్వర్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషాను కూడా నిందితులుగా చేర్చినట్లు సీఐ తెలిపారు.

జిల్లా రగ్బీ బాలబాలికల జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా రగ్బీ అండర్-12 బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. మంగళవారం ఎంపిక చేసిన జట్ల వివరాలను రగ్బీ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ సంపత్‌కుమార్ ప్రకటించారు. ఎంపికైన బాలుర జట్టులో...యువన్, రుద్రమనాయుడు, శివసాయి, మానస్, ప్రణీత్, అభిరామ్ చరణ్, జి హర్షవర్ధన్, బషీర్, సంతోష్ నాయక్, సూర్య, రేవంత్‌నాయక్, ఎస్ హర్షవర్ధన్‌లు ఉన్నారు. బాలికల జట్టులో...ఆద్య, గీష్మణి, చరిత, జ్ఞానదీపిక, గ్రేసీ, అమృత, సాహితి, సోనియా, భవ్యశ్రీ, యశ్విత, గౌతమి ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు నెల్లూరు జిల్లా కావలిలో డిసెంబరు 1వతేదీ నుంచి రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రగ్బీ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మురళీమోహన్, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, ఆపరేషన్ డైరెక్టర్ రాజశేఖర్, కోచ్‌లు అలేఖ్య, లక్ష్మి, పీడీ కేశవమూర్తి, క్రీడాకారులు పాల్గొన్నారు.


ఎంపికైన జిల్లా రగ్బీ అండర్‌-12 బాలబాలికల జట్టు

పీఏబీఆర్‌లో పర్యాటక

అభివృద్ధి ఏదీ...?

టికెట్ల కౌంటర్



రూ.అరకోటి గంగపాలు

వైసీపీ హయాంలో బోటింగ్ ఇంజన్ల తరలింపు



పీఏబీఆర్‌లో దెబ్బతిన్న బోటింగ్ సామగ్రి

కూడేరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద పర్యాటకంగా ఎలాంటి అభివృద్ధి జరగలేదు. రిజర్వాయర్‌లో పర్యాటకుల కోసం గత టీడీపీ ప్రభుత్వం రూ.54 లక్షలతో బోటింగ్ ఏర్పాటు చేసింది, వైసీపీ పాలనలో దానిని గాలికి వదిలేశారు. దీంతో బోటింగ్, పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన సామగ్రి పాడైపోయాయి. పీఏబీఆర్ డ్యాంలో పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి 2017- 18 సంవత్సరంలో రూ. 54 లక్షల నిధుల మంజూరు చేసింది. డ్యాంలో నీరు ఉండడంతో అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుండటంతో రెండు ఇంజన్లతో బోటింగ్ ఏర్పాటు చేశారు. ఒకటిన్నర టీఎంసీ నీరు నిల్వ ఉంటే బోటింగ్ చేయడానికి అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. డ్యాం నీటిలో రాళ్లు అధికంగా ఉండటంతో రెండు టీఎంసీల నీరు నిల్వ ఉంటే తప్ప బోటింగ్ చేయడానికి సాధ్యం కాదని భావించిన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. దీంతో ఆలనాపాలన కరువై నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. పీఏబీఆర్ డ్యాంలో ప్రస్తుతం మూడు టీఎంసీల నీరు నిల్వ ఉండటంతో సందర్శకుల తాకిడి పెరిగింది. ప్రభుత్వం స్పందించి డ్యాంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.

వైసీపీ అధికారంలోకి రాగానే....

పీఏబీఆర్ డ్యాంలో గత టీడీపీ హయాంలో బోటింగ్ ఏర్పాటు చేయగా. వైసీపీ అధికారంలోకి రాగానే అధికారులు పట్టించుకోక పోవడంతో రూ. 54 లక్షలు గంగ పాలయ్యాయి. పీఏబీఆర్ డ్యాంను చూడటానికి సెలవు దినాలతోపాటు పండుగ సమయాల్లో వివిధ ప్రదేశాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. పర్యాటకులకు నీటిలో విహరించడానికి బోటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. డ్యాంలో నీటి నిల్వ సక్రమంగా లేకపోవడం, అధికారులు పట్టించుకోకపోవడంతో అరకోటి నిధులు వృథా అయ్యాయి. 2022వ సంవత్సరంలో కడప జిల్లాకు ఆనుకొని ఉన్న చిత్రావతి, పార్నపల్లి డ్యాంలో బోటింగ్ ప్రారంభించడానికి అప్పటి సీఎం జగన్‌రెడ్డి వస్తుండటంతో పీఏబీఆర్ డ్యాంలో ఉన్న రెండు ఇంజన్లను తరలించారు. నేటికి బోటింగ్ ఇంజన్లు పీఏబీఆర్ డ్యాంకు తీసుకరాలేదు. దీంతో నీటిలో ఉన్న బోటింగ్ సామగ్రిని బయటకు తరలించారు.

బోటింగ్ ఇంజన్లు తెప్పిస్తాం

పీఏబీఆర్ డ్యాంలో ఉన్న రెండు బోటింగ్ ఇంజన్లను ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు కడప జిల్లాకు తరలించారు. వాటిని తిరిగి తీసుకురావడానికి సంబంధిత అధికారులకు లేఖ రాశాం. డ్యాంలోనున్న బోటింగ్ యూనిట్‌కు సంబంధించిన సామగ్రి దెబ్బతినడంతో ప్రభుత్వానికి నివేదిక పంపాం. నిధుల విడుదల చేస్తే పర్యాటక అభివృద్ధి చేస్తాం.

-జయకుమార్, పర్యాటక శాఖ అధికారి

వరుస చోరీలతో జనం బెంబేలు

పోలీసుల నిర్లక్ష్యం

కనిపించని రికవరీలు



ఫర్టిలైజర్స్ దుకాణంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం (ఫైల్)

ఉరవకొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వరుస చోరీలతో ఉరవకొండ పట్టణ వాసులు బెంబేలెత్తుతున్నారు. పట్టపగలే దర్జాగా చోరీలు చేస్తూ ఉడాయిస్తున్నారు. వరుస చోరీలు పోలీసులకు సవాలుగా మారుతున్నాయి. పోలీసుల నిర్లక్ష్యంతోనే వరుస చోరీలు జరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెలరోజుల వ్యవధిలోనే నాలుగుచోట్ల చోరీలు జరిగాయి. వాటిలో రెండు చోట్ల పట్టపగలే దొంగలు చోరీలకు పాల్పడ్డారు. ప్రధాన కూడళ్ల, నివాసగృహాలకు సీసీ కెమెరాలు ఉన్నా ఇప్పటి వరకూ దొంగలు పట్టుబడలేదు. ఎక్కువ మొత్తంలో డబ్బులు, నగలు పోగొట్టుకున్న వారు మాత్రమే పోలీసులను ఆశ్రయిస్తున్నారు. చిన్నాచితక దొంగతనాలకు సంబంధించి కేసులు దాఖలు కావడం లేదు. దొంగలు రెక్కీ నిర్వహించి పక్కా ప్రణాళికలతో తాళం వేసిన ఇళ్లు, ఆలయాలు, షాపులను లక్ష్యంగా చేసుకుంటున్నారు.

- ఉరవకొండ మండలంలోని చిన్నముష్టూరు గ్రామంలో పట్టపగలే చోరీకి పాల్పడి రైతు చౌడమ్మ ఇంట్లో 10 తులాల బంగారం, రూ.60వేల నగదును ఎత్తుకెళ్లారు.
- పట్టణంలోని ఏటీఎం కేంద్రంలో కార్డును మార్చి ఓ వ్యక్తికి చెందిన రూ.79వేల నగదును దుండగుడు చోరీకి పాల్పడ్డాడు.
- ఈ నెల 20న పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో బాబా పంచలోహ విగ్రహం, వెండి పళ్లెం, గంటలు ఎత్తుకెళ్లారు.
- ఈ నెల 10న బాలాజీ టాకీస్ సమీపంలో మహదేవ్ ఫర్టిలైజర్స్ తాళాలు పగులగొట్టి రూ.70వేల నగదును చోరీ చేశారు. సీసీ ఫుటేజీల్లో చోరీకి పాల్పడిన దృశ్యాలు నమోదయ్యాయి.
- బూదగవి గ్రామంలో గతనెల ఆర్డీటీ కాలనీలోని ఓ ఇంటికి తాళాలు పగులగొట్టి చోరీ పాల్పడ్డారు. బీరువాను ధ్వంసం చేసి రూ.2లక్షల నగదు, 8 తులాల బంగారం ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఇప్పటి వరకూ నిందితులను పట్టుకున్న దాఖలాలు లేవు.

రికవరీ ఏదీ..?

ఉరవకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్నో చోరీలు జరిగినా రికవరీలు కనిపించడం లేదు. రాత్రి వేళల్లో గస్తీ కూడా చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చోరీలు జరిగినపుడు కేసులు నమోదు చేస్తున్నారే తప్పా.. రికవరీలపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీస్ అధికారులు చొరవ చూపి చోరీలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులును వివరణ కోరగా.. చోరీల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, గస్తీ కూడా పెంచుతున్నట్లు తెలిపారు.

ఉచిత శిక్షణకు నేడు స్క్రీనింగ్ పరీక్ష

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): యూపీఎస్‌సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకున్న ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన అభ్యర్థులకు బుధవారం స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కుష్బూకొఠారీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకున్న ఉమ్మడి అనంత జిల్లాకు చెందిన అభ్యర్థులు బుధవారం ఉదయం 10.30 గంటలలోపు అనంతపురం జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షకు హాజరుకావాలన్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ ఉంటుందన్నారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి విజయవాడలోని బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ : 08554-275575, సెల్ : 7799043773, 9704204905కు సంప్రదించాలన్నారు.

ఆర్మీ క్యాంటిన్‌లో గొడవ

సంఘం పేరుతో కొందరు మాజీ సైనికుల హల్‌చల్

మేనేజర్‌పై దాడికి యత్నం



ఆర్మీ క్యాంటిన్‌లో గొడవ పడుతున్న మాజీ సైనికులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆర్మీ క్యాంటిన్‌లో తాజాగా జరిగిన ఓ గొడవ వెలుగులోకి వచ్చింది. కొందరు మాజీ సైనికులు సంఘం ముసుగులో క్యాంటిన్‌కి వచ్చి హల్‌చల్ చేశారు. తాము అడిగిన మద్యం ఇవ్వాలంటూ రుబాబు చేయడంతో పాటు... ఆ క్యాంటిన్ మేనేజర్ మారుతీప్రసాద్‌పై దాడికి యత్నించారు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఆర్మీ క్యాంటిన్‌లోకి కొందరు మాజీ సైనికులు వచ్చి తాము అడిగిన మద్యం బాటిళ్లు ఇవ్వాలని మేనేజర్‌ను కోరారు. ఒక్కొక్కరికి ఒక కార్డు మీదే ఇస్తామని, అది కూడా సంబంధిత వ్యక్తి ఉంటేనే ఇస్తామని చెప్పారు. మద్యం బాటిళ్లు అమ్ముకుంటున్నావని, నీ కథ చూస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. కొడితే అడ్డు ఎవరొస్తారని మేనేజర్ మారుతీప్రసాద్‌పై బెదిరింపులకు దిగారు. క్యాంటిన్‌లో మాజీ సైనికులు ఉన్నారని... విధులకు ఆటంకం కలిగించొద్దని చెప్పినప్పటికీ వినిపించుకోలేదు. ఆర్మీ క్యాంటిన్‌కు నెలనెలా భారీ స్థాయిలో స్టాకు వస్తుంటుంది. తాజాగా జరిగిన గొడవతో మాజీ సైనికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వీటన్నిటికి కారణం ఆర్మీ క్యాంటిన్‌కు పోలీసు భద్రత లేకపోవడమేనన్నది స్పష్టంగా అర్థమవుతోంది.

నాపై దాడికి యత్నించారు...

శనివారం ఉదయం 10 గంటలకు మాజీ సైనికులు సుదర్శన్ రెడ్డి, నల్లపరెడ్డి క్యాంటిన్‌కు వచ్చారు. మాకు కావాల్సినవి ఇవ్వాలని అడిగారు. ఏం కావాలో తీసుకెళ్లండని చెప్పినా దుర్భాషలాడారు. నాపై దాడిచేసేందుకు యత్నించారు. క్యాంటిన్ మేనేజర్‌గా నా హుందాతనాన్ని కాపాడుకోవడం కోసం... మాజీ సైనికులు ఉన్నారు. గొడవ వద్దని నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు. ప్రస్తుతం నేను కోసం బెంగళూరుకు వచ్చాను. వచ్చిన తరువాత పైస్థాయి అధికారులు, కలెక్టర్, ఎస్పీలకు జరిగిన ఘటనపై ఫిర్యాదు చేస్తాను. నాకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది.

- మారుతీప్రసాద్, మేనేజర్, ఆర్మీ క్యాంటిన్

సీబీఐ పేరుతో బెదిరింపు కాల్

డబ్బు పంపాలని డిమాండ్

పోలీసులను ఆశ్రయించిన బాధితుడు



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న బాధితుడు రమేష్

గార్లదిన్నె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'డ్రగ్స్ కేసులో మీ కుమారుడిని అరెస్టు చేశాం. డబ్బు పంపకపోతే ముంబయికి తీసుకెళతాం' అని సీబీఐ ఆఫీసర్ పేరుతో ఓ వ్యక్తికి ఫోన్ వచ్చింది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. గార్లదిన్నె మండలం పెనకచెర్లడ్యాం గ్రామానికి చెందిన రమేష్ కూలీపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రమేష్‌కు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు యశ్వంత్‌ను కర్నూలులోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ చదివిస్తున్నారు. సోమవారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో 923475202587 నెంబరు నుంచి ఫోన్ వచ్చింది. 'మేం సీబీఐ నుంచి మాట్లాడుతున్నాం.. మీ కుమారుడిని డ్రగ్స్ కేసులో అదుపులోకి తీసుకున్నాం. రూ. 20 వేలు మేం చెప్పిన నెంబరుకు ఫోన్‌పే ద్వారా డబ్బు పంపండి.. లేదంటే ముంబయికి తీసుకెళతాం' అంటూ హిందీలో బెదిరించారు. మీ కుమారుడిని చిత్రహింసలు పెడుతున్నామని, పిల్లలు ఏడ్చే ఏడుపులు శబ్దాన్ని వినిపించడంతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే కళాశాలకు ఫోన్ చేసి అక్కడి సిబ్బందితో తన కుమారుడి గురించి ఆరా తీశారు. దీంతో తమ కుమారుడు వసతి గృహంలోనే క్షేమంగా ఉన్నాడని తెలుసుకున్నారు. వారికి వచ్చిన ఫోన్ కాల్ విషయాన్ని పోలీసులకు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌సేషన్‌లో ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషాకు ఫిర్యాదు చేశారు. బెదిరింపు కాల్‌పై విచారణ చేస్తామని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా ఫోన్ చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తే భయపడకుండా తమను సంప్రదించాలని ఆయన సూచించారు.

టమోటా కిలో రూ.36


అనంతపురం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 36తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 420 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయ న్నారు. కిలో సరాసరి ధర రూ. 28, కనిష్ఠ ధర రూ. 20 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.34వేలు

అనంతపురం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.34వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.12వేలు, సరాసరి రూ.22వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 42 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

కనిపించని జోష్..!

మందకొడిగా టీడీపీ సభ్యత్వ నమోదు
లక్ష్యానికి ఆమడదూరం
నెల రోజులు గడుస్తున్నా అంతంతే
ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకూ 5.5 లక్షలే..
అత్యధికంగా కళ్యాణదుర్గంలో 77,670..
అత్యల్పంగా తాడిపత్రిలో 11,887 సభ్యత్వాలు



అనంతపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): క్రియాశీలక కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలం. పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తలు ఆ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారు. అధిష్ఠానం సైతం కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోంది. పార్టీ క్రియాశీలక సభ్యత్వంతో క్షేత్రస్థాయిలో ఆ పార్టీ మరింత బలాన్ని పెంచుకునే దిశగానే అడుగులు వేస్తోంది. అధికారంలో ఉండడంతో క్రియాశీలక సభ్యత్వంతో లక్షలాది మందిని పార్టీకి చేరువ చేసే దిశగా చర్యలు చేపట్టింది. ఇదివరకూ లేని విధంగా... సభ్యత్వ నమోదులో సరికొత్త పంథాను ఆ పార్టీ అధిష్ఠానం ఎంచుకుంది. సభ్యత్వ నమోదు రుసుం రూ. 100గా నిర్ణయించారు. కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని గతంలో రూ. 2లక్షలుగా ఉన్న ప్రమాద బీమాను తాజాగా చేపట్టిన సభ్యత్వ నమోదులో ఏకంగా రూ. 5లక్షలకు పెంచారు. ఇదిలా ఉండగా... ఉమ్మడి అనంత జిల్లాలో టీడీపీ సభ్యత్వ నమోదు మందకొడిగా సాగుతోందనడంలో సందేహం లేదు. అధికారంలో ఉన్న నేపథ్యంలో... సభ్యత్వ నమోదు అధిష్ఠానం అంచనాలకు మించి జరుగుతుందనే అభిప్రా యం ఉండేది. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించలేదు. మందకొడిగా సభ్యత్వ నమోదు జరుగుతోంది. గడిచిన 29 రోజుల్లో... ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో 5.5 లక్షల క్రియాశీలక సభ్యత్వాలు మాత్రమే నమోదయ్యాయి. దీన్నిబట్టి చూస్తే... సభ్యత్వ నమోదులో జోష్ కనిపించడం లేదన్నది స్పష్టంగా అర్థమవుతోంది.

లక్ష్యానికి ఆమడదూరంలో...

తెలుగుదేశం పార్టీకి ఆయువు కార్యకర్తలే. ఈ నేపథ్యంలోనే ప్రతి నియోజకవర్గంలోనూ లక్ష క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేయాలన్నది అధిష్ఠానం నిర్ణయం. ఆ లెక్కన ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో... 14 లక్షలు క్రియాశీలక సభ్యత్వాలు నమోదవుతాయని పార్టీ అధిష్ఠానం యోచన. జిల్లాలో అధిష్ఠానం లక్ష్యానికి ఆమడదూరంలో ఆ ప్రక్రియ ఉంది. పార్టీ ముఖ్యుల సమావేశాల్లోనూ... సభ్యత్వ నమోదు కార్యక్రమ సభల్లోనూ... జిల్లాలో సభ్యత్వ నమోదులో మనమే ముందుండాలని ప్రతి నియోజకవర్గంలోనూ ఆ నియోజకవర్గ ముఖ్య నేతలు ద్వితీయ శ్రేణి నాయకత్వానికి దిశానిర్దేశం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఆ ఫలితాలు కనిపించడం లేదు. అత్యధిక నియోజకవర్గాల్లో అధిష్ఠానం అంచనాలో 50 శాతం సభ్యత్వాలు నమోదు కాకపోవడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలో 5.5 లక్షలే..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 నియోజకవర్గాలున్నాయి. అనంతపురం పార్లమెంటు పరిధిలో 7, హిందూపురం పార్లమెంటు పరిధిలో మరో 7 నియోజకవర్గాలు ఉన్నాయి. అనంతపురం పార్లమెంటు పరిధిలో నియోజకవర్గాల వారీగా సభ్యత్వ నమోదు పరిశీలిస్తే.. కళ్యాణదుర్గం 77,670, గుంతకల్లు 42,010, అనంతపురం అర్బన్ 32,974, ఉరవకొండ 30,834, రాయదుర్గం 28,179, శింగనమల 19,579, తాడిపత్రి 11,887లో సభ్యత్వాలు నమోదయ్యాయి. హిందూపురం పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదును పరిశీలిస్తే.. మడకశిర 45,052, పెనుకొండ 41,699, పుట్టపర్తి 41,103, రాప్తాడు 39,640, కదిరి 35,845, ధర్మవరం 35,784, హిందూపురం 27,488 సభ్యత్వాలు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,05,744 సభ్యత్వాలు సోమవారం సాయంత్రం నాటికి నమోదయ్యాయి. ఇప్పటి వరకూ ఉమ్మడి జిల్లాలో సభ్యత్వ నమోదులో కళ్యాణదుర్గం నియోజకవర్గం 77,670 సభ్యత్వాలతో మొదటి స్థానంలో ఉండగా.. తాడిపత్రి నియోజకవర్గం 11,579 సభ్యత్వాలతో ఆఖరి స్థానంలో నిలిచింది. శాశ్వత సభ్యత్వం తీసుకునే నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వ రుసుం కింద రూ. లక్షగా నిర్ణయించిన విషయం తెలిసిందే. పార్టీ శాశ్వత సభ్యత్వం కింద ఉమ్మడి జిల్లాలో 8 మాత్రమే నమోదయ్యాయి. అందులో.. కళ్యాణదుర్గం, శింగనమల, రాప్తాడు, కదిరి, ధర్మవరంలో ఒక్కొక్కరు, అనంతపురం అర్బన్‌లో ముగ్గురు శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు.

విద్యార్థులను వేధిస్తే చర్యలు

ఎస్సీ సంక్షేమశాఖ డీడీ హెచ్చరిక

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కళాశాలలు ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తే చర్యలు తప్పవని ఎస్సీ సంక్షేమశాఖర డిప్యూటీ డైరెక్టర్ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆయన జిల్లాలోని అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన మొత్తం రాష్ట్ర ప్రభుత్వం ఆయా కళాశాలలకు జమచేసే విధంగా జీవో ఎంఎస్ నెంబర్-87ను విడుదల జారీ చేసిందని తెలిపారు. అదే విధంగా పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ మంజూరు కాలేదన్న నెపంతో అర్హత కలిగిన విద్యార్థులకు హాల్ టికెట్లు మంజూరు చేయకపోవడం, పరీక్షలకు హాజరుకానివ్వకపోవడం, విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను కళాశాలల యాజమాన్యాలు తమ ఆధీనంలో ఉంచుకుంటే కఠిన చర్యలు తీసుకునేవిధంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని హెచ్చరించారు.

సంక్షేమంపై కలెక్టర్ వరాల జల్లు

రెండో విడత భారీగా నిధులు విడుదల
34 వసతి గృహాలకు రూ. 6.12 కోట్లు
51 వసతి గృహాల్లో సీసీ కెమెరాలకు రూ. 13 లక్షలు



అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాలపై కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వసతిగృహాలను పరిశీలించి వాటి బాగుకోసం ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి నివేదికలు తెప్పించుకున్న విషయం విదితమే. అందులో భాగంగా మొదటి విడతలో సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని అత్యంత శిథిలావస్థలో ఉన్న 10 వసతి గృహాలు, ఒక గురుకుల పాఠశాలను ఎంపిక చేశారు. అందుకోసం ప్రభుత్వానికి నివేదికలు పంపి.. రూ. 1.35 కోట్లు విడుదల చేశారు. అనుకున్నట్లుగానే మూడు నెలల్లో ఆయా వసతి గృహాలకు మెరుగులు దిద్దారు. బీసీ వసతిగృహాలకు సంబంధించి మొదటి విడతలో 28 వసతి గృహాల మరమ్మతులు, సీసీ కెమెరాల ఏర్పాటు కోసం రూ. 3.67 కోట్లు విడుదల చేశారు. ఆయా వసతి గృహాల్లో పనులు కొనసాగుతున్నాయి. సాంఘిక సంక్షేమశాఖకు రెండో విడతలో భాగంగా కలెక్టర్ వినోద్‌కుమార్ వరాల జల్లు కురిపించారు. ఏకంగా 34 వసతి గృహాలను ఎంపిక చేసి.. వాటిలో మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన కోసం రూ. 6.12 కోట్లు నిధులు విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 51 సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో ఒక్కో వసతి గృహానికి నాలుగు సీసీ కెమెరాల ఏర్పాటుకు అదనంగా మరో రూ. 13 లక్షలు కేటాయించారు. వసతిగృహాలపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుండటంతో విద్యార్థులు, సంక్షేమశాఖల అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కందిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

బుక్కరాయసముద్రం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కంది పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు, జిల్లా వ్యవసాయాధికారి మహేశ్వరమ్మ మంగలవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం కంది పంట శాఖీయ, పూత దశ నుంచి కాయ అభివృద్ధి దశలో ఉందన్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులకు కందిలో మారుకా మచ్చల పురుగు, పచ్చ పురుగు ఉధృతి అధికంగా ఉందని తెలిపారు. రైతులు కందిలో పంటలో వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎమామెక్టిన్ బెంజోయోట్, నోవాల్యురాన్ 1.5 మి.లీ లేదా థాయోక్లోప్రిడ్, ఫ్లూబెండమైడ్ 1.25 మి.లీ లేదా క్లోరాన్ ట్రానిలిప్రోల్ 0.3 మి.లీ ఎమామెక్టిన్ బెంజోయోట్ 0.4 లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అదే విధంగా పత్తి పంటను గులాబీ రంగు పురుగు ఆశించిందని తెలిపారు. నష్ట పరిమితిని బట్టి ప్రోఫినోఫాస్ 2.0 మి.లీ లేదా క్లోరోఫైరిఫాస్ 2.5 మి.లీ లేదా క్వినాల్ ఫాస్ 2.0 మి.లీ లేదా ఇండాక్సికార్బ్ 1.0 మి.లీ లేదా ఫైనోసాడ్ 0.3 మి.లీ ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పురుగు ఆశించిన గుడ్డిపూలు, రాలిన పూత, పిందెలను సేకరించి నాశనం చేయాలని రైతులు కు సూచించారు.

క్యాన్సర్ నిర్ధారణకు ప్రత్యేక ఓపీ



క్యాన్సర్ యూనిట్ ప్రారంభోత్సవంలో ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

అనంతపురం టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో క్యాన్సర్ నిర్ధారణకు ప్రత్యేక ఓపీ ప్రారంభిస్తున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో క్యాన్సర్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మంగళ, గురువారాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఓపీ ఉంటుందన్నారు. రొమ్ము, నోటి, గర్భసంచి క్యాన్సర్ ప్రారంభదశలోనే గుర్తించి వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బధిరుల క్రికెట్ పోటీల్లో పలు జట్ల విజయం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బధిరుల నేషనల్ అండర్-19 జాతీయ స్థాయి క్రికెట్ టీ-20 చాంపియన్‌షిప్ పోటీల్లో పలు జట్లు విజయం సాధించాయి. మంగళవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో రెండో రోజు బధిరుల క్రికెట్ పోటీలు కొనసాగాయి. ఐదో మ్యాచ్‌లో ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య జరగగా...నిర్ణీత 20 ఓవర్లలో ఢిల్లీ 7వికెట్లు కోల్పోయి 168 పరుగులు చేసింది. ఇందులో యువరాజ్ 66 పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన ఉత్తరప్రదేశ్ 15.5 ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. గజరాజ్‌స్వామి 60 పరుగులు చేశాడు. ఆరో మ్యాచ్‌లో మధ్యప్రదేశ్, హర్యానా జట్లు తలపడగా...మధ్యప్రదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన హర్యానా 19.4 ఓవర్లలో 8 వికెట్లను కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఏడో మ్యాచ్‌లో ఒడిషా, ఆంధ్రప్రదేశ్ బరిలోకి దిగగా ఒడిశా 17.4 ఓవర్లలో 133 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన ఆంధ్రప్రదేశ్ 8.5 ఓవర్లలో 42 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఒడిశా బౌలర్ నితీష్‌బెహరా 5వికెట్లు తీసి జట్టు విజయానికి కీలకంగా మారాడు. 8వ మ్యాచ్‌లో మహారాష్ట్ర, చత్తీస్‌ఘర్‌లు తలపడగా.....మహారాష్ట్ర 15 ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 126 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన చత్తీస్‌ఘర్ 13.5 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 72 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. కార్యక్రమంలో బధిరుల క్రికెట్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు సుమిత్‌జైన్, ఆర్డీటీ మేనేజర్ శ్రీదేవి, జిల్లా మేనేజర్ దేవరాజ్, బధిరుల క్రికెట్ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న బధిరులు

రూరల్ కబడ్డీ లీగ్ విజేతలు ఆర్డీటీ, తాడిపత్రి జట్లు



బాలికల విజేత ఆర్డీటీ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రూరల్ కబడ్డీ లీగ్ విజేతలుగా ఆర్డీటీ, తాడిపత్రి జట్లు నిలిచాయి. అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ, ఆర్డీటీ, వివేకానంద స్పోర్ట్స్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో రూరల్ కబడ్డీ లీగ్ పోటీలు నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి మొరార్జీయాదవ్ పోటీలను ప్రారంభించారు. ఇందులో బాలికల విభాగంలో ఆర్డీటీ, కూడేరు కేజీబీవీ, డీఎస్‌ఏ, కౌకుంట్ల జట్లు పాల్గొంటాయన్నారు. బాలుర విభాగంలో ఆర్డీటీ, డీఎస్‌ఏ, కౌకుంట్ల, తాడిపత్రి జట్లు ప్రాతినిధ్యం వహించాయి. హోరా హోరీగా సాగిన పోటీల్లో బాలుర విభాగంలో తాడిపత్రి జట్టు విజేతగా నిలవగా, ఆర్డీటీ జట్టు రన్నర్‌గా నిలిచింది. బాలికల విభాగంలో ఆర్డీటీ జట్టు విజయం సాధించగా, వివేకానంద క్లబ్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అనంతరం విజేత జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రవికాంత్‌రమణ, చల్లా శ్రీనివాస్, శాప్ కబడ్డీ కోచ్ అనిల్‌కుమార్, వివేకానంద కబడ్డీ క్లబ్ సభ్యుడు కుమార్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఎస్కేయూ పీడీ శివానంద, పీడీలు అంజనాబాయి, సునీత, లక్ష్మీకుమారి, ప్రసన్నలక్ష్మి, ప్రత్యూష, కోచ్‌లు రామయ్య, నాగ నరసింహులు, పృథ్వీ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్..

నేడు విద్యుత్ సరఫరా బంద్

ధర్మవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డ్ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమత్తుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ కొండారెడ్డి ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శాంతినగర్, మున్సి పల్ కార్యాలయం, కదిరిగేటు, చంద్రబాబునగర్, శివానగర్, కేశవ నగర్, చిన్నూరు, గొట్లూరు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

విత్తనకాయల పంపిణీ

కొత్తచెరువు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరా పురం రైతుసేవా కేంద్రం వద్ద విత్తన వేరుశెనగ కాయలను మంగళవారం వ్యవసాయ అధికారి నటరాజ్ పంపిణీ చేశారు. మండలంలో తలమర్ల, మైలసముద్రం, మీర్జాపురం, కొడపగానిపల్లి, లోచర్ల, బండ్లపల్లి, పోతులకుంట రైతుసేవా కేంద్రాల్లో విత్తనకాయలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల, టౌన్ కన్వీనర్‌లు రామకృష్ణ, ఒలిపి శీన, సర్పంచ్ రవి పాల్గొన్నారు.

బయోమెట్రిక్ వేయకపోతే జీతం కట్

గాండ్లపెంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు ప్రతి రోజూ బయోమెట్రిక్ వేయాలని, లేకుంటే జీతం కట్ చేస్తామని ఎంపీడీఓ వెంకటామిరెడ్డి స్పష్టంచేశారు. మంగళవారం మండలంలోని సోమయాజులపల్లి సచివాలయాన్ని తనిఖీ చేసిన ఆయన మాట్లాడారు. ఏడు సచివాలయాల్లో 70 మంది ఉద్యోగులుండగా, సోమవారం 25 మంది బయోమెట్రిక్ వేయకుండా వెళ్లారని, వీరిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఆయన వెంట కార్యదర్శి బాషా, సిబ్బంది ఉన్నారు.

భూముల బదిలీపై సర్వే



భూములను పరిశీలిస్తున్న అటవీ, రెవెన్యూ అధికారులు

బుక్కపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్ 342 హైవే నిర్మాణం వలన మండలంలోని చెండ్రాయుని పల్లి వద్ద నుంచి బుచ్చయ్యగారిపల్లి వరకు రిజర్వు ఫారెస్టు భూములను అటవీశాఖ కోల్పోయింది. దీంతో అందుకు ప్రత్యామ్నాయంగా రెవెన్యూ భూములను అటవీశాఖకు బదిలాయించడం కోసం కేంద్ర అటవీ అధికారులు మంగళవారం మండలంలో సర్వే నిర్వహించారు. మండలంలోని సిద్ధరాంపురం రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 913-3లో 10.63సెంట్లు, అలాగే సికేపల్లి మండలం గంగినేపల్లి రెవెన్యూ పొలం సర్వెనెంబరు 182లో 11.87 సెంట్లు అధికారులు సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర అటవీ అధికారి కర్రీ బాలాజీ, జిల్లా అటవీ అధికారి చక్రపాణి, అధికారులు యామినిసరస్వతి, శ్రీనివాసులరెడ్డి, తహసీల్దార్ షాబుద్దీన్, ఆర్‌అండ్‌బీ డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఈ సుజాత పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

ఓబుళదేవరచెరువు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలకు నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథ్‌రెడ్డి పాల్గొంటున్నట్లు మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబుళరెడ్డి, కన్వీనర్ శెట్టివారి జయచంద్ర తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించడంతోపాటు ప్రజల సమస్యలపై చర్చిస్తామన్నారు.

తెలంగాణ సీఎం, ఎంపీని కలిసి పరిటాల శ్రీరామ్



రేవంత్‌రెడ్డి, రామ్మోహన్‌తో పరిటాల శ్రీరామ్

ధర్మవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడులను ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో వారిని కలిసిన పరిటాల శ్రీరామ్ పలు విషయాలపై చర్చించారు.

మండల సర్వసభ్య సమావేశం

కదిరి అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. అన్నిశాఖలాధికారులు తమ పరిధిలో జరిగిన అభివృద్ధిని వివరించారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు నిరుపయోగంగా ఉన్నాయని ప్రజాప్రతినిధులు తెలిపారు. అలాగే మినీ గోకులం షెడ్‌కు దరఖాస్తు చేసుకున్నవారికి మంజూరు చేయాలన్నారు. ఎంపీడీఓ పొలప్ప మాట్లాడుతూ.. ఆ గోదాములు అందుబాటులోకి తేచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీక్రిష్ణ, ఆయాశాఖాధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాలను కాపాడండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్నసీపీఐ నాయకులు

ధర్మవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపాలిటీలోని రిజర్వు స్థలాలను చాలా వరకు ఇప్పటికే కబ్జా అయ్యాయని, మిగిలిన వాటినైనా కాపాడేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగు మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చిన ఆయన మాట్లాడారు. కేతిరెడ్డి, వైఎస్ఆర్, ఇందిరమ్మ కాలనీ, తుంపర్తి కాలనీల్లో కూడా స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయన్నారు. మున్సిపల్ ప్లానింగ్ అప్రూవల్ లేకుండా భవనాలు నిర్మిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, సహాయకార్యదర్శి రమణ, చేనేత కార్మికసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటనారాయణ, వెంకటస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సకల రాజా, నాయకులు పాల్గొన్నారు.

వినికిడి పరీక్షల శిబిరానికి విశేష స్పందన

ధర్మవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోతుకుంట రోడ్డు పక్కన ఉన్న నూతన ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నిర్వహిస్తున్న ఉచిత వినికిడి పరీక్షల శిబిరానికి విశేష స్పందన లభించింది. వినికిడి లోపం ఉన్న వారికి ఈ శిబిరంలో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారు. ఈనెల 29 వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తారు. ఇందులో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ మాధవి, డాక్టర్ వివేక్ తదితర వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 27న తాడిమర్రి, ముదిగుబ్బ, 28న బత్తలపల్లి, 29న ధర్మవరం పట్టణ ప్రాంతాలకు వినికిడి పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి కార్యాలయ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు.

అంతా ఆర్భాటమే..

గత వైసీపీ ప్రభుత్వం అవగాహన లేమితో రూ.కోట్ల ప్రజాధనం వృథా చేసింది. నిర్మాణ సామగ్రి, ఆర్వో ప్లాంట్లు, ఇతర పరికరాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. నాడు-నేడు పేరుతో పాఠశాలల రూపురేఖలు మార్చుతామంటూ ఆర్భాటంగా ప్రారంభించారు. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ బడులను మార్చుతామని కోట్లాది రూపాయలను ఇష్టానుసారంగా మంజూరు చేశారు. నిధులను పూర్తి స్థాయిలో మంజూరు చేయకపోవడంతో పనులన్నీ అర్ధంతరంగా ఆగిపోయాయి.



గాండ్లపెంటలో ఆగిన అంగన్‌వాడీ భవన నిర్మాణం


- వైసీపీ ప్రభుత్వ అవగాహనలేమి
- పూర్తికాని పనులు
- రూ.కోట్ల ప్రజాధనం వృథా
- అరకొరగా నిధులు మంజూరు
- ఆగిన నిర్మాణాలు
- నిరుపయోగంగా సామగ్రి, పరికరాలు
- ఇబ్బందుల్లో విద్యార్థులు

గాండ్లపెంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాడు నేడు రెండో విడతలో భాగంగా తాళ్లకాలువ, తూపల్లి, నల్లగుట్టతండా, గాండ్లపెంట, పత్రవాండ్లపల్లి, అరమకవారిపల్లిలో అంగన్‌వాడీ భవన నిర్మాణాలు చేపట్టింది. ఒక భవనం నిర్మాణానికి రూ.16 లక్షలు నిధులు విడుదల చేశారు. అలాగే మండలంలోని ప్రాథమిక పాఠశాలలైన పెద్దతండా రూ.19.41 లక్షలు, రెడ్డివారిపల్లి రూ.15.37 లక్షలు, గాజులవారిపల్లి రూ. 14.77 లక్షలు, కటకంవారిపల్లి రూ.21.75 లక్షలు, కోటపల్లి రూ.15.74 లక్షలు, బనాన్‌చెరువుపల్లి రూ.23.49 లక్షలు, సోమయాజులపల్లి రూ.24.11 లక్షలు, ప్రాథమికోన్న పాఠశాలలు సామచేనుభైలు రూ.25.45 లక్షలు, గాండ్లపెంట రూ.24.89 లక్షలు, గొడ్డివెలగల రూ.18.75 లక్షలు, ఉన్నత పాఠశాలలు కటారుపల్లి రూ.80.95 లక్షలు, నీరుకుంట్లపల్లి రూ. 66.07 లక్షలు, రెక్కమాను 80.99 లక్షలు, కస్తూరిబా రూ.95.98 లక్షలు మంజూరు చేశారు. ఇందులో ఆరు అంగన్‌వాడీ, ఎనిమిది ప్రాథమిక, మూడు ప్రాథమికోన్నత, మూడు ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూరిబా పాఠశాలల నిర్మాణాలకు, ఫర్నీచర్, మెటీరియల్‌కు మొత్తం రూ.6,49,75,000 కావాలని అంచనాలు వేశారు. అందులో 2,35,40,000 మెటీరియల్‌కు మంజూరు చేశారు. దీంతో కాంట్రాక్టర్లు ఆ మెటీరియల్‌ను కొనుగోలు చేశారు. అనంతరం రూ. 4,14,35,000 విడుదల చేయాల్సి ఉండగా.. కేవలం రూ. 1,20,00,000 మాత్రమే మంజూరు చేసింది. దీంతో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరి, నూతన గదుల నిర్మాణం, తరగతి గదుల మరమ్మతులు, గ్రీన్ బోర్డులు, పెయింటింగ్ తదితర పనులు ఆగిపోయాయి.

● వృథాగా నిర్మాణ పరికరాలు

మండల వ్యాప్తంగా 21 పాఠశాలలో వివిధ దశలో ఉన్నాయి. భవనాలకు కావలసిన తలుపులు, కిటికీలు, విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి (ఆర్వో ప్లాంట్) తదితర వాటికి సంబంధించిన సుమారు రూ.2.35 కోట్ల విలువైన సామగ్రిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. అయితే నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో వాటిని అధికారులు మూలన పడేశారు.







ఆగిన మరుగుదొడ్ల నిర్మాణం, రంగులు వేయని తరగతి గది, మూలన పడిన నిర్మాణ, ఆర్వో ప్లాంట్ సామగ్రి

● ఇబ్బందుల్లో విద్యార్థులు :

పలు గ్రామాల్లో పాఠశాలల్లో బాత్‌రూమ్‌లు, నీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రెండో విడత నాడు నేడు కింద వీటి నిర్మాణాలను ప్రారంభించారు. తాగునీటికి అసరమైన సామగ్రిని కొనుగోలు చేశారు. అయితే పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేయడంతో అవి అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో విద్యార్థులకు మరుగుదొడ్ల సౌకర్యం లేక ఆరుబయటకు వెళ్తున్నారు. నిర్మాణ సామగ్రిని తరగతి గదుల్లో నిరుపయోగంగా పడేశారు. మరికొన్ని పాఠశాలల్లో తరగతి గదుల మరమ్మతులు, నిర్మాణాలు పూర్తి అయ్యాయి. అయితే ఏడాదిగా ఆ గదులకు రంగులు వేయలేదు. బాత్‌రూమ్‌లు, ప్రహరి నిర్మాణాలు ఇంకా సాగుతుండటంతో వీటికి రంగులు వేయలేదు.

● అసాంఘిక కార్యకలాపాలు : పలు తరగతి గదులు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు అర్ధాంతరంగ ఆగిపోయాయి. ఈ నిర్మాణాలకు తలుపులు, కిటికీలు లేకపోవడంతో మందు బాబులు మద్యం సేవించడానికి.. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయి. నిర్మాణానికి తెచ్చిన ఇసుక, కంకర వాచ్‌మన్ లేకపోవడంతో సెలవు రోజుల్లో దుండగులు ఎత్తుకెళ్లారు.

జోరుగా ఫుట్‌పాత్ వ్యాపారాలు





ఫుట్‌పాత్ మీద వెలసిన దుకాణాలు

పుట్టపర్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జయంతి వేడుకల నేపథ్యంలో ఫుట్‌పాత్ వ్యాపారాల జోరందుకున్నాయి. ఏటా ఫుట్‌పాత్‌లపై బెంగుళూర్, ఇతర ప్రాంతాల వ్యాపారులు తమ సరుకులు తీసుకువచ్చి వ్యాపారాలు చేస్తుంటారు. ఈ సారి ఎక్కువ దుకాణాలను ఏర్పాటు చేయడంతో వీధులు కిటకిటలాడాయి. సామాన్యులకు ఇంటి అవసరాలకు ఉపయోగపడే వస్తువులు తక్కువ ధరకే అందుబాటులో ఉంచడంతో మహిళలు ఎగబడి వాటిని కొన్నారు. ముఖ్యంగా గృహ అలంకరణకు అవసరమైన వస్తువులను మహిళలు, ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేశారు. మరో రెండు రోజులు ఫుట్‌పాత్‌లపై ఈ దుకాణాలు ఉంటాయి. కాగా, వీటి ఏర్పాటుతో సంవత్సరాల తరబడి ఉన్న దుకాణాల్లో వ్యాపారాలు డీలాపడ్డాయి.



మోటారుతో నీటిని పంపింగ్ చేస్తున్న సిబ్బంది

ఐదేళ్ల తాగునీటి సమస్య పరిష్కారం

పుట్టపర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని అన్నక్యాంటీన్ సమీపంలో మంచినీటి బోరు మోటారు ఐదేళ్లక్రితం కాలిపోయింది. దీంతో ఆ ప్రాంతవాసులు తాగునీరు అందక ఇబ్బందులు పడేవారు. పలుమార్లు అధికారులు, పాలకులను విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాలేదు. కూటమి ప్రభుత్వం రాకతో స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి దృష్టికి స్థానికులు ఈ సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే కొత్త మోటారును ఏర్పాటు చేసి నీటి సమస్య పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సిబ్బంది కొత్త మోటారు ఏర్పాటు చేసి.. నీటి సరఫరా చేశారు. దీంతో నీటి సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా తెపోత్సవం

బుక్కపట్నం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం చెరువులో లక్ష్మీనారాయణస్వామి తెపోత్సవాన్ని మంగళవారం రాత్రి కన్నులపండుగా నిర్వహించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు హరిస్వామి ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి చెరువులో ఉత్సవ విగ్రహాలకు తెపోత్సవం నిర్వహించారు. ఉత్సవాన్ని తిలకరించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో టీడీపీ చింతా మల్లిరెడ్డి, సామకోటి ఆదినారాయణ, గంగాధర్, సాకే యశోద, సతీష్ రాయల్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న పల్లె రఘునాథరెడ్డి

వరికి తుఫాన్ గండం

వర్షం వస్తే గింజలు రాలిపోతాయని రైతుల ఆందోళన



ధర్మవరం మండలంలో కోతకొచ్చిన వరి పంట

ధర్మవరంరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా బలపడింది. దీంతో జిల్లాలో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని శాస్త్రవేత్తలు ప్రకటించారు. మండలంలో 1000 హెక్టార్లకు పైగా ఖరీఫ్‌లో వరిసాగు చేశారు. పంట సాగు చేసి నాలుగు నెలలు గడవడంతో ప్రస్తుతం పంట దిగుబడి వచ్చి కోత దశకు చేరుకుంది. ఈ సమయంలో తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడితే వరి పంట దెబ్బతింటుందని, వరి నేలకొరిగి గింజలు నేలరాలుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వారంపాటు వర్షం రాక పోతే వరిపంటను కోత కోసుకుని ఇంటికి చేర్చుకునే వాళ్లమని, ప్రస్తుతం తుఫాన్ ప్రభావంతో మేఘాలు ముసురుకోవడంతో దిక్కుతోచడం లేదని వాపోతున్నారు. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి రాత్రింబవళ్లు పంటను కాపాడుకుంటూ వచ్చామని... తీరా గింజలు ఏర్పడిన తర్వాత తుఫాన్‌ల ప్రభావంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే ధాన్యపుగింజలు నాని.. నూర్పిడి చేసేటప్పుడు బియ్యపు గింజ విరిగిపోతుందని, దీంతో నూకలు అవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా పంట చేతికి వచ్చే సమయంలో అతివృష్టి, అనావృష్టి కారణంగా పంట దిగుబడి చేతికందకుండా పోతోందని వాపోతున్నారు.

వానభయం పట్టుకుంది



నేను సాగుచేసిన వరిమడి కోతకు వచ్చింది. ఈ సమయంలో వర్షాలు వస్తే గింజలు రాలిపోతాయనే భయంగా ఉంది. కోతదశలో వర్షం వస్తే భూమి ఆరదు. దీంతో పంట కోత కోసేందుకు కూడా ఇబ్బందిగా ఉంది. మిషన్‌లు రాకపోవడంతో కూలీలను పెట్టి పంట కోయాల్సి ఉంటుంది. దీంతో ఖర్చులు పెరుగుతాయి.

-జయప్రకాష్‌రెడ్డి, బుడ్డారెడిపల్లి, ధర్మవరం మండలం

పంట దిగుబడిపై ఆందోళన



నేను రెండు ఎకరాల్లో వరిసాగు చేశాను. ప్రస్తుతానికి పంట గింజలు ఏర్పడ్డాయి. ఈ సమయంలో తుఫాన్ ఉందని వార్తలు రావడంపై ఆందోళన ఉంది. వర్షం వస్తే వరిమళ్లు పడిపోతాయి. గింజలు దెబ్బతింటాయి. దీంతో దిగుబడిపై ఆందోళన ఉంది. ఇలా అతివృష్టి, అనావృష్టి కారణంగా ఏటా పంటలను నష్టపోతూనే ఉన్నాం.

- నరసింహారెడ్డి, రైతు, తుమ్మల

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కదిరి, ధర్మవరం, ముదిగుబ్బ, కొత్తచెరువు, నల్లమాడ , నంబులపూలకుంట, నల్లచెరువు, ఓబుళదేవర చెరువు, గాండ్లపెంట తదితర ప్రాంతాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి, ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హనుమద్ వ్రతానికి పట్టువస్త్రాల అందజేత

గుంతకల్లుటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వెల్దుర్తి గ్రామ జాతీయ రహదారి పక్కన వెలసిన హనుమాన్ దేవాలయానికి కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయం తరఫున మొట్టమొదటిసారి పట్టువస్త్రాలను ఆలయ ధర్మకర్త కే సుగుణమ్మ, ఆలయ అధికారులు మంగళవారం అందజేశారు. ఆలయ ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



స్వామి పూజలో పాల్గొన్న కసాపురం ఆలయ ధర్మకర్త, ఆలయ అధికారులు

గ్రామసభపై అధికారుల నిర్లక్ష్యం

రైతులకు తప్పని ఎదురుచూపులు



అధికారుల కోసం ఎదురు చూస్తున్న రైతులు

తాడిమర్రి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రకారం మంగళవారం ఉదయం 10 గంటలకు మండలంలోని పిన్నదరి గ్రామంలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక గ్రామసభ నిర్వహించాలి. దీంతో పలువురు రైతులు ఉదయం 9.30 గంటలకే ఆ గ్రామసభకు వచ్చారు. అయితే అధికారులు మాత్రం రూ. 11.30 గంటలైనా.. ఏ ఒక్కరూ హాజరుకాలేదు. చివరికి రైతులు ఎందుకు గ్రామసభకు రాలేదంటూ సంబంధిత వీఆర్వోకు ఫోన్‌చేస్తే ఈ రోజు గ్రామసభ రద్దు అయిందని, తరువాత ఉత్తర్వులు రాగానే సభ నిర్వహిస్తామని నింపాదిగా సెలవెచ్చాడు. దీంతో అంతవరకూ అధికారుల కోసం నిరీక్షించిన రైతులు నిరాశతో వెనుతిరిగారు. కనీసం సభ రద్దు అయినట్లు అయినా అధికారులు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

పరిగి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాసనకోట గ్రామ సమీపంలో మంగళవారం జయమంగళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను ఎస్ఐ రంగడు యాదవ్ తన సిబ్బందితో వెళ్లి సీజ్ చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు వాగులు వంకల నుంచి ఇసుకను స్థానికులు మాత్రమే ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఇంటి నిర్మాణాల కోసం తరలించుకోవచ్చని ప్రభుత్వం ఇటీవల జీఓ విడుదల చేసిందన్నారు. నూతన ఇసుక నియమ నిబంధనలు పాటించకుండా శాసనకోట, హిందూపురం, కొల్లకుంట, గ్రామాల ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్లను సీజ్‌చేసి కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

క్రీడా ఆణిముత్యాలు

పాఠశాలకు పేరు తెస్తున్న విద్యార్థులు



మంజుల

పరిగి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబంలో జన్మించి ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ కొందరు విద్యార్థులు క్రీడల్లో తమ నైపుణ్యాన్ని చూపుతూ ముందుకు అడుగు వేస్తుంటారు. పరిగి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన మంజుల అనే విద్యార్థిని అండర్-14 ఫుట్‌బాల్ క్రీడల్లో జాతీయస్థాయికి ఎంపికై త్వరలో జరగనున్న ఫుట్‌బాల్ అండర్-14 ఆంధ్ర రాష్ట్ర జట్టు తరుపున తన ప్రతిభ చాటుకోనుంది. ఇదే పాఠశాలకు చెందిన రాజు అనే విద్యార్థి అండర్-14 కబడ్డీ రాష్ట్రస్థాయి ఆటలో పాల్గొననున్నాడు. రమ్య, హర్షవల్లి అండర్- 17 ఫుట్‌బాల్ క్రీడల్లో రాష్ట్రస్థాయి జట్టులో స్థానం సంపాదించారు. పాఠశాలలో తమ క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసిన వ్యాయామ ఉపాధ్యాయుడు వినోద్, ప్రధానోపాధ్యాయులు కృపాసత్య రాజ్ ప్రోత్సాహంతో చదువుకున్న పాఠశాలకు జన్మించిన గ్రామానికి మంచి పేరు తీసుకురావడం సంతోషకరమన్నారు. అధికారులు, నాయకులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషిచేస్తున్న విద్యార్థులకు దాతలు ఆర్థిక సాయం అందిస్తే చదువుతోపాటు ఆటల్లో కూడా ముందుకు సాగేందుకు వీలు కలుగుతుందని గ్రామస్తులు అంటున్నారు.

వడుసులమ్మ అమ్మవారికి విశేష పూజలు



మడకశిరటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని పట్టణంలోని పలు దేవాలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆఖరి మంగళవారం పట్టణంలోని వడుసులమ్మ, గంగాభవాని, కొల్లాపురమ్మ, కన్యకాపరమేశ్వరీ ఆలయాలతో పాటు మారుతీనగర్‌లో వెలిసిన అభయ ఆంజనేయ స్వామి ఆలయం, మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివార్లకు ఆకుపూజ అలంకరణ, విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు, కన్నుల పండువగా నిర్వహించారు. చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఎరువుకు పెరిగిన డిమాండ్

పెనుకొండ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సేంద్రీయ ఎరువులకు డిమాండ్ పెరగడంతో కర్నాటక నుంచి ఆంధ్రకు వ్యాపారులు ఎగబడుతున్నారు. పెనుకొండ మండలంలో 66వేలకుపైగా గొర్రెలు, మేకలున్నాయని పశు సంవర్థకశాఖ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో తుమకూరు ప్రాంతంలో వక్కచెట్లు, చీనిచెట్లు ద్రాక్ష తోటలు సాగుచేసిన రైతులు గొర్రెలు, మేకల ఎరువు కోసం ఈ ప్రాంతానికి వస్తున్నారు. వ్యాపారులు, రైతుల నుంచి 40 కేజీల బస్తా రూ.60 వంతున కొనుగోలు చేస్తున్నారు. దీంతో సేంద్రీయ ఎరువులకు భారీగా డిమాండ్ పెరిగింది. గతంలో రూ.వెయ్యి నుంచి రూ.1500 పలికే ట్రాక్టర్ ఎరువు ప్రస్తుతం రూ.4వేలు దాకా పలుకుతోంది.

రేపటి నుంచి భగవద్గీత ప్రవచనాలు

గోరంట్ల, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈనెల 28, 29, 30 తేదీల్లో భగవద్గీత ప్రవచనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బ్రహ్మకుమారి ఈశ్వరీబాయి విశ్వవిద్యాలయం రజనీ తెలిపారు. గోరంట్లలోని ఓశాంతి భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కర్నాకటకుచెందిన వీణబేహన్ ప్రవచానాలు వినిపిస్తారన్నారు. ప్రతిరోజు వాసవి మహల్‌లో సాయంత్రం 5.30నుంచి 7.30వరకు కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

ఉపాధిహామీపై గ్రామసభలు

పెనుకొండ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటగిరిపాళ్యం, దుద్దేబండ గ్రామాలలో ఉపాధిహామీ పనులపై గ్రామసభలు నిర్వహించినట్లు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా 2024-25సంవత్సరాలకు సంబంధించి ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ అనుసంధాన పనులైన కంపచెట్ల తొలగింపు, కాలువల పూడికతీత, మట్టిరోడ్డు పనులు ప్లాంటేషన్స్, ఫారంపాండ్స్ పనులు చేసుకోవాలని గ్రామసభలో తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గీత, ఏపీఓ జయమ్మ, టీడీపీ నాయకులు పోతిరెడ్డి, గొల్లపల్లి రామక్రిష్ణ, ఉపాధి సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రబీ పంటలకు బీమా ప్రీమియం చెల్లించండి

చిలమత్తూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వరి, వేరుశనగ, టమోట పంటలకు బీమా ప్రీమియం చెల్లించే ప్రక్రియ ప్రారంభమైందని మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో రైతులకు తెలియజేశారు. బ్యాంకుల్లో పంట రుణాలు పొందిన రైతులు నేరుగా బ్యాంకు ద్వారా, పంట రుణాలు పొందని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా బీమా ప్రీమియం చెల్లించుకోవాలన్నారు. ప్రీమియం చెల్లించే రైతులు ఆధార్, బ్యాంకు ఖాతా పుస్తకం, పట్టాదార్ పాసుపుస్తకం, పంట ధృవీకరణ పత్రం, ఆధార్ అనుసంధానం చేసిన మొబైల్ ఫోన్ నంబర్ వివరాలను జత చేసి మీసేవ కేంద్రాల్లోగానీ, పోస్టాఫీసులోగానీ ప్రీమియం చెల్లించాలన్నారు. డిశంబరు 15 వరకు వేరుశనగకు, టమోటాకు, డిశంబరు 31 వరకు వరి పంటకు ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. రైతులే స్వయంగా ఎన్‌సీఐసీ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు.

అడుగడుగునా అసౌకర్యాలే



గుంతల మయంగా మారిన రోడ్డు



ట్యాంకర్లతో నీటిని కొంటున్న దృశ్యం

- అద్దె కట్టలేక అప్పులు చేసి ఇంటి నిర్మాణం
- తాగునీటి కోసం నెలకు రూ.2వేలు ఖర్చు
- తప్పని పరిస్థితుల్లో గుంతల రోడ్లలోనే రాకపోకలు
- ఇల్లు పూర్తయినా గృహప్రవేశం చేయని లబ్ధిదారులు
- జగనన్న లేఅవుట్‌లో ఇదీ పరిస్థితి

పెనుకొండ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలను గుర్తించి వారికి పట్టాలు అందించి జగనన్న లేఅవుట్ అని నామకరణం చేసి 1.5సెంట్లలో ఇల్లు నిర్మించుకునేలా లేఅవుట్ వేశారు. అనంతరం అధికారులు ఇళ్లు నిర్మించుకోవాలని తెచ్చిన ఒత్తిడి తట్టుకోలేక అప్పులుచేసి ఇల్లు నిర్మించుకున్నారు. గొప్పలు చెప్పిన అప్పటి అధికార వైసీపీ ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. ఈ లే అవుట్లలో 40అడుగుల రోడ్లున్నా డ్రైనేజీలు లేవు. ఆటో, స్కూటర్ వెళ్లాలన్నా తిప్పలు తప్పవు. ఇక రాత్రివేళల్లో గుంతల్లోపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ఈ రోడ్లలో ఎన్డీఏ నాయకులు పర్యటించి ఈ లేఅవుట్లలో సౌకర్యాలు కల్పించాలని, మంత్రి సవిత తమపై కనికరం చూపాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఎన్టీఆర్ కాలనీకి అనుకుని ఉన్న 29.14ఎకరాల్లో 1006మంది అర్హులకు అప్పటి ఎమ్మెల్యే మంత్రి శంకర్‌నారాయణ హయాంలో పట్టాలు ఇచ్చారు. ఆ సమయంలో బహిరంగసభ పెట్టి అన్ని వసతులు కల్పిస్తామని, సొంతింటి కల నెరవేర్చుకోవాలని ప్రగల్భాలు పలికారు. ఇంతవరకు అలాంటివేవి అమలు కాలేదు. ఒక్కొక్కరికి 1.5సెంట్లు 40అడుగుల రోడ్డు చూపించి చేతులు దులుపుకున్నారు.

అద్దె కట్టలేక..

కియా పరిశ్రమ రావడంతో పెనుకొండ పట్టణంలో అద్దెలు ఆకాశాన్నంటాయి. ఈ క్రమంలో పలువురు ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇంటి నిర్మాణానికి పూనుకున్నారు. ఈ లేఅవుట్‌లో అన్ని సౌకర్యాలు ఉంటాయనుకుని ఇంటి నిర్మాణానికి అప్పులుచేసి ముందుకొచ్చారు. సొంతింటి కల నెరవేర్చుకుందామనుకుని ఈ లేఅవుట్‌లో ఎలాగోలా ఇల్లు పూర్తి చేసుకున్నారు. అయితే ఇక్కడ అన్ని అసౌకర్యాలే ఉండటంతో ఇల్లు పూర్తయినా గృహప్రవేశాలు చేయని ఇళ్లు చాలా దర్శనమిస్తున్నాయి. పట్టణ ప్రధాన రహదారి నుంచి జగనన్న లేఅవుట్ దాదాపు 1.5కి.మి. ఉంది. ఆ రహదారి కూడా అధ్వాన్నంగా ఉంది. ఇక్కడ చేరినవారు నిత్యం ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తూనే ఉన్నారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు తదితర సౌకర్యాలు పూర్తయితే కానీ గృహప్రవేశాలు చేయలేమని మిగిలిన లబ్ధిదారులు అంటున్నారు.

లేఅవుట్‌కు శాపంగా మారిన నగర పంచాయతీ

పెనుకొండ గ్రామ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా పెనుకొండను మార్చారు. ఇది లేఅవుట్‌కు శాపంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద అభివృద్ధి జరుగుతోంది. ప్రస్తుతం ఈ నగర పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి పెనుకొండకు ఆ నిధులు మంజూరు కాలేదు. లేఅవుట్ అభివృద్ధిచేయాలంటే నగర పంచాయతీ ఆపనులు చేపట్టాలి. అరకొర నిధులతో లేఅవుట్‌ను ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నిస్తున్నారు లబ్ధిదారులు.

నగర పంచాయతీకి అప్పజెప్పలేదు: శ్రీనివాసులు, కమిషనర్

మూడేళ్ల క్రితం ఏర్పడిన నగర పంచాయతీకి జగనన్న లేఅవుట్‌ను అప్పజెప్పలేదు. లేఅవుట్‌పై పూర్తి బాధ్యతలు రాగానే ఒక్కొక్కటిగా అభివృద్ధిచేస్తాం. ఈ లేఅవుట్‌లో నీటిసమస్యను ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులే పరిష్కరించాలి.

మంచినీటి కొనుగోలు అదనపు భారం



అంజినమ్మ

ఈ లేఅవుట్‌లో ఎనిమిదినెలలుగా నివాసముంటున్నాము. మంచినీటి ట్యాంకరుకు రూ.600 చెల్లించి తీసుకుంటున్నాము. నెలకు మూడు ట్యాంకర్లు అవసరమవుతున్నాయి. బయట అద్దెలు కట్టలేక ఇక్కడికివస్తే నీళ్ల కొనుగోలు భారంగా మారింది. పైప్‌లైన్ వేసి మంచినీటి సౌకర్యం కల్పించాలి.

గుంతల రోడ్లలో నిండా ఇబ్బంది



ఖాజాబీ, కాలనీవాసి

కాలనీకి వచ్చి ఏడావుతోంది. 40అడుగుల రోడ్డు, ఎటుచూసినా గుంతలు. ఇంటివద్దకు ఆటో రావాలన్నా ఇబ్బందులే. తేలికపాటి వర్షం కురిస్తే చిత్తడిగా మారి అనారోగ్యాలపాలవుతున్నాం. అధికారులు ఇటువైపు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్న పాపాన పోలేదు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతు సంఘం ర్యాలీ



రాస్తారోకో నిర్వహిస్తున్న అధ్యక్షుడు పూజారప్ప

పావగడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలను పరిష్కరించని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మంగళవారం పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు పంటలు నష్టపోయారని, ఈవిషయంపై ప్రభుత్వాలకు నివేదిక పంపి నష్టపరిహారం అందించాలని ఎన్నో సార్లు విన్నవించినా అధికారులు, ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా కొబ్బరికి మద్దతు ధర కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు కూడా ఇంతకు మునుపే వివరించామని, అయినా ఎలాంటి స్పందన లేకపోవడంతో తాము ధర్నాచేపడుతున్నట్లు ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రైతులకు అన్ని విధాలా న్యాయం చేకూర్చాలని, లేనిపక్షంలో అసెంబ్లీ సమావేశాలు కూడా నిలుపు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈసందర్భంగా వందలాది మంది రైతు నాయకులు ర్యాలీలో పాల్గొని తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు.

పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛతా హి సేవ

గుడిబండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందలపల్లి పంచాయతీ కార్యాలయం పరిశుభ్రతకు నిలయంగా మారింది. వారం రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో మందుబాబులకు అడ్డా మందలపల్లి పంచాయతీ కార్యాలయం అనే శీర్షికన కథనం వెలువడింది. అధికారులు స్పందించి పంచాయతీ కార్యాలయం చుట్టూ ఉన్న అపరిశుభ్రతను తొలగించి శుభ్రం చేయించి మందుబాబులు కార్యాలయానికి రాకుండా అడ్డుకట్ట వేశారు. గతంలో మందుబాబులు రాత్రి వేళల్లో మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించేవారు. ప్రస్తుతం కార్యాలయానికి, కాంపౌండ్‌కు తాళాలు వేశారు. ప్రతిరోజూ అధికారులు కార్యాలయాన్ని తెరిచి సేవలు అందిస్తున్నారు. దీంతో పంచాయతీ కార్యాలయంలో ప్రజలకు సేవలు అందిస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వజ్రోత్సవ వేళ..

సామాన్యుడికి అధికారం కట్టబెట్టడానికి భారత రాజ్యాంగం అవకాశమిచ్చింది. అలాగే వాక్‌స్వాతంత్ర్యాన్ని ప్రసాదించింది. అటువంటి రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా మంగళవారం ఊరూవాడా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం హిందూపురం బాలాజీ కళాశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఏడీజే కంపల్లె శైలజ మాట్లాడుతూ, ప్రపంచ దేశాల కంటే మనదేశ రాజ్యాంగం చాలా బలమైందన్నారు. గోరంట్ల తహసీల్దార్ మారుతి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అలాగే హిందూపురం, పెనుకొండ, రొళ్ల, అగళి మోడల్ పాఠశాలలో, చిలమత్తూరులో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు.



మాట్లాడుతున్న ఏడీజే కంపల్లె శైలజ

గోరంట్లలో..

అగళి మోడల్ స్కూల్‌లో ...

రేకలకుంట ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ

మడకశిర పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ..

హిందూపురంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రగతి

పెనుకొండలో అంబేద్కర్‌కు నివాళులు

చిలమత్తూరులో రెవెన్యూ సిబ్బంది...

అర్హులందరికీ ఇళ్లు

హౌసింగ్ అధికారుల భేటీలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గంలో ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి ఇవ్వడమే లక్ష్యంగా చర్యలు తీసుకొంటున్నామని అందులో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో ఇల్లు లేని పేదలను గుర్తించాలని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని యాదవ కల్యాణమండపం ఆవరణలో నియోజకవర్గంలోని హౌసింగ్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలపాలన్నదే తమ లక్ష్యం అన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మడకశిర నియోజకవర్గ పర్యటన సందర్భంగా పది వేల ఇళ్ల నిర్మాణానికి అంగీకారం కోరగా అందుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

మడకశిర అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం

మడకశిర నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేద్దామని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు పిలుపునిచ్చారు. మంగళవారం యాదవ కల్యాణమండపం ఆవరణంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి నియోజకవర్గం స్థాయి టీడీపీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా టీడీపీ అధ్యక్షులు అంజినప్ప, పలువురు నాయకులు హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, జడ్పీటీసీ సభ్యులు ఉమేష్, అన్ని మండలాల కన్వీనర్లుపాల్గొన్నారు.

రైతు సంక్షేమమే చంద్రన్న లక్ష్యం: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే రాజు అన్నారు. మంగళవారం పట్టణంలో సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి రైతులకు అందించారు. ఒక్క మడకశిర నియోజకవర్గంలోనే 5వేల మంది రైతులకు దాదాపు రూ.51 లక్షల పరికరాలను ఇచ్చామన్నారు.

పదేళ్ల సమస్యకు పరిష్కారం



రోడ్డుపక్కకు మార్చిన ట్రాన్స్‌ఫార్మర్

మడకశిరటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టు ముందు భాగంలో నడిరోడ్డుపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం వల్ల ఇప్పటివరకూ ప్రతిరోజు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. మంగళవారం ఎట్టకేలకు విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడినుంచి మార్చారు. దీంతో ఎట్టకేలకు పదేళ్ల సమస్యకు పరిష్కారం దొరికింది. రోడ్డు మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం వల్ల ప్రయాణికులు ప్రతి రోజు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎట్టకేలకు విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చడంతో సమస్యకు తెరపడింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న లారీని క్రేన్‌ద్వారా పక్కకుతీస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హరిపురం వైజంక్షన్‌లో ఓ లారీ కంటెయినర్‌ను ఢీకొనడంతో లారీ డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కియా పోలీసులు తెలిపిన వివరాల మేరకు బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న కంటెయినర్‌ను వెనుక వైపు నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. అయితే వాహనాలు జాతీయ రహదారిపై ఆగిపోవడంతో దాదాపు 2గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు

ఇద్దరికి గాయాలు

సోమందేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని నల్లగొండ్రాయనపల్లి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకెళితే గుడిపల్లికి చెందిన శంకర్‌నాయక్ అతని మిత్రుడు బైక్ మీద రోడ్డు దాటుతున్న సమయంలో అటుగా వచ్చిన లారీ తగిలి కిందపడ్డారు. డ్రైవర్ చాకచక్యంతో వ్యవహరించడంతో ప్రాణాపాయం తప్పింది. గాయపడిన ఇరువురిని 108ద్వారా పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంజనేయ స్వామికి కార్తీక మాసపూజలు

పెనుకొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెరువువద్ద దక్షిణముఖ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం కార్తీకమాసం సందర్భంగా ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేకపూజలు, అర్చనలు నిర్వహించి తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు.